# షెడ్యూల్డు ప్రాంత గ్రామ సభల నిర్వహణ - మార్గదర్శి



పల్లా త్రినాధరావు

రిసోర్స్ ఫర్ లీగల్ ఏక్షన్
రాజమండ్రి

ఐ.టి.డి.ఎ. రంపచోడవరం, తూర్పు గోదావరి జిల్లా సౌజన్యంతో..

# షెడ్యూల్డు ప్రాంత గ్రామసభల నిర్వహణ - మార్గదర్శి

పల్లా త్రినాథరావు

రిసోర్స్ ఫర్ లీగల్ ఏక్షన్
రాజమండ్రి

ఐ.టి.డి.ఎ. రంపచోడవరం, తూర్పు గోదావరి సౌజన్యంతో...

# షెడ్యూల్డు ప్రాంత గ్రామసభల నిర్వహణ - మార్గదర్శి

మొదటి ప్రచురణ : జూలై, 2012

రెండవ ప్రచురణ : నవంబర్, 2013

ప్రతులు : 1000

ప్రచురణ :

**రిసోర్స్ ఫర్ లీగల్ ఏక్షన్ (ఆర్.ఎల్.ఏ)**

(ఐ.టి.డి.ఎ రంపచోడవరం, తూ॥గో॥జిల్లా, సౌజన్యంతో)

ప్రతులకు :

**పల్లా త్రినాధరావు**

78-10-4/3,

ఎస్.బి.ఐ.కాలనీ,

శ్యామలానగర్,

రాజమండ్రి - 533 103

సెల్ : 98481 66448

## విషయ సూచిక

| | | |
|---|---|---|
| | ముందు మాట | i |
| | నా మాట | ii |
| I | షెడ్యూల్డు ప్రాంత పంచాయతీ రాజ్ విస్తరణ (పెసా) చట్టం - గ్రామసభ అధికారాలు | 01 |
| 1. | గ్రామం - గ్రామసభ | 01 |
| 2. | గ్రామసభ నిర్వహణ - పద్ధతి | 01 |
| 3. | గ్రామసభ తీర్మానాలపై సమీక్ష | 06 |
| 4. | గ్రామసభ మౌలిక అధికారాలు (సమీక్ష, పర్యవేక్షణ, నిర్ణయాధికారం) | 07 |
| 5. | మోడల్ నమూనాలు: | 19 |
| | 1) గ్రామ సభ - తీర్మానాలు | 19 |
| | 2) నిధుల ధృవీకరణ పత్రం | 20 |
| | 3) గ్రామసభ ఉమ్మడి ఆస్తుల నిర్వహణ రిజిష్టరు | 21 |
| | 4) ప్రభుత్వ పథకాలు - లబ్ధిదార్ల రిజిస్టరు | 22 |
| | 5) గ్రామసభ నగదు పుస్తకం | 22 |
| | 6) గిరిజన భూమి అన్యాక్రాంతంపై ఫిర్యాదు | 23 |
| | 7) గిరిజన భూమి సాగు వివరాలు నమోదుకు విజ్ఞప్తి | 24 |
| | 8) చిన్న తరహా అటవీ ఉత్పత్తుల రవాణా పర్మిట్ | 25 |
| II | అటవీ హక్కుల గుర్తింపు చట్టం-గ్రామసభ అధికారాలు | 26 |
| III | జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం-గ్రామసభ అధికారాలు | 29 |
| IV | అనుబంధాలు: | 30 |
| 1. | ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత పంచాయితీరాజ్ విస్తరణ (పెసా) నియమాలు 2011 | 30 |
| 2. | ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంత పంచాయితీరాజ్ చట్టం (పెసా) 1998 | 49 |
| 3. | కేంద్ర షెడ్యుల్డ్ ప్రాంత పంచాయతీ రాజ్ విస్తరణ చట్టం(పెసా) 1996 | 52 |
| 4. | గ్రామ పంచాయితీలకు అధికారాల బదిలీ - ప్రభుత్వ ఉత్తర్వులు | 56 |

## సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ)

సి.నాగరాణి, తూర్పు గోదావరి జిల్లా
ప్రాజెక్టు ఆఫీసర్ రంపచోడవరం

స్థానిక స్వపరిపాలనలో 'గ్రామసభ'ల పాత్ర కీలకం. షెడ్యూల్డు ప్రాంతాల్లో గ్రామసభల పాత్ర మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. షెడ్యూల్డు ప్రాంత పంచాయితీ (విస్తరణ) చట్టం (పెసా) 1998 కింద గ్రామసభ, పంచాయితీలకు విశిష్ట అధికారాలు కల్పించబడ్డాయి. 'పెసా' చట్టం కింద నియమాలు కూడా ప్రభుత్వం 2011లో రూపొందించింది. 'పెసా' చట్టం అమలు కోసం ఇటీవలే గ్రామసభలు ప్రకటన చేస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు కూడా జారీచేసింది. గిరిజన గ్రామాభివృద్ధిలో నిర్ణయం తీసుకునే అధికారం గ్రామసభలకు ఉంటుంది. సామాజిక, ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాల అమలు, సంప్రదాయ వివాదాల పరిష్కారం, చిన్నతరహా అటవీ ఉత్పత్తులు, మద్యం అమ్మకాలు, వడ్డీవ్యాపారం, గిరిజన భూ పరాయీకరణ వివాదాలు తదితర విషయాలలో గ్రామసభలకు అధికారాలు ఇవ్వబడ్డాయి. సమిష్టిగా నిర్ణయంతీసుకొనే ప్రక్రియలో గ్రామసభ సభ్యులందరూ భాగస్వామ్యం కావాలి. గ్రామసభలు స్వతంత్రంగా వ్యవహరించాలి, తీసుకున్న నిర్ణయాలు అమలు కోసం సంబంధిత పంచాయితీరాజ్ సంస్థలకు, అధికారులకు తెలియజేయాలి. 'పెసా' చట్టం అమలు కోసం రాష్ట్ర గిరిజన ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాల ద్వారా "రిసోర్స్ ఫర్ లీగల్ ఏక్షన్" కృషి సల్పుతున్నది. గిరిజనులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి 'పెసా' చట్టం పై అవగాహన కల్పించేందుకు **"షెడ్యూల్డు ప్రాంత గ్రామసభల నిర్వహణ - మార్గదర్శి"** అనే పుస్తకం "రిసోర్స్ ఫర్ లీగల్ ఏక్షన్" తీసుకురావటం జరిగింది. ఏజెన్సీ గ్రామ పంచాయితీ సర్పంచ్‌లకు, గ్రామ సభ సభ్యులకు మరియు ఇతర ప్రభుత్వ సిబ్బందికి 'పెసా' చట్ట అవగాహన విషయంలో ఈ పుస్తకం మరింతగా ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.

**తేది: 3-11-2013** **ప్రాజెక్టు ఆఫీసర్**

**సోమేష్ కుమార్,** ఐ.ఏ.ఎస్
కమీషనర్, గిరిజన సంక్షేమ శాఖ. హైదరాబాద్

## ముందుమాట

రాష్ట్ర షెడ్యూల్డు ప్రాంతాల్లో స్థానిక పాలన కోసం కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్డు ప్రాంత పంచాయితీల విస్తరణ (పెసా) చట్టం 1996లో తీసుకువచ్చింది. కేంద్ర చట్టాన్ని ఆధారంచేసుకొని రాష్ట్ర ప్రభుత్వం 1998లో రాష్ట్ర షెడ్యూల్డు ప్రాంతాలకు పెసా చట్టం రూపొందించింది. చట్టం అమలుకు 2011లో నియమాలు రూపొందించబడ్డాయి. పెసా చట్టం కింద గ్రామ సభలకు, గ్రామ పంచాయతీ, మరియు మండల ప్రజా పరిషత్తులకు స్థానికపాలన విషయంలో అధికారాలు ఇవ్వబడినవి. గిరిజన గ్రామాభివృద్ధిలో గ్రామసభ పాత్ర విశిష్టమైనది. సామాజిక, ఆర్థిక అభివృద్ధి ప్రణాళికల అమలుకు అనుమతి, మద్యపాన నిషేదం, చిన్నతరహా నీటి వనరులు, చిన్న తరహా అటవీ ఉత్పత్తులు, భూమి అన్యాక్రాంత నిరోధక విషయంలో తదితర అంశాలపై గ్రామసభలకు అధికారాలు, బాధ్యతలు ఇవ్వబడినవి. షెడ్యూల్డు ప్రాంత గ్రామసభ నిర్వహణ పద్ధతి, గ్రామసభ అధికారాలపై అవగాహన కల్గించడానికి **'షెడ్యూల్డు ప్రాంత గ్రామసభల నిర్వహణ - మార్గదర్శి'** అనే ప్రచురణ "రిసోర్స్ ఫర్ లీగల్ ఏక్షన్" తీసుకురావడం ముదావహం. గ్రామసభను ఎలా నిర్వహించుకోవాలి? అధికారాలు వివరణ ఈ ప్రచురణలో వివరించబడినది. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెసా చట్టాలు, నియమాలు, పంచాయితీలకు బదలాయించిన అధికారాలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వుల న్యాయ విజ్ఞాన సమాచారాన్ని ఈ ప్రచురణలో పొందుపర్చబడినవి. షెడ్యూల్డు ప్రాంత స్థానిక సుపరిపాలన విషయంలో గిరిజనులకు, గిరిజనాభివృద్ధికి సంబంధించిన ప్రభుత్వ సిబ్బందికి పెసా చట్టం అమలు విషయంపై ఈ ప్రచురణ అవగాహనకు ఉపకరిస్తుందని ఆశిస్తున్నాను.

తేదీ : 12-7-2012

గిరిజన సంక్షేమ కమీషనర్

## నా మాట....

ఆదివాసుల స్వయం పాలన, సాధికారత సాధించేందుకు రూపొందించిన రాష్ట్ర షెడ్యూల్డు ప్రాంత పంచాయతీల విస్తరణ చట్టం(పెసా) అమలుకు నోచుకోవడం లేదు. పెసా చట్టం రాజ్యాంగంలో అంతర్భాగం. పంచాయతీ సంస్థల అధికారాల కల్పనకు ఉద్దేశించిన 73వరాజ్యాంగ సవరణ అమలులో షెడ్యూల్డు ప్రాంతాలకు మినహాయింపు ఇచ్చారు. షెడ్యూల్డు ప్రాంత పాలనకు సంబంధించిన ప్రత్యేక రాజ్యాంగ నియమాలు అమలులో ఉన్నందున ప్రత్యేక పంచాయతీరాజ్ వ్యవస్థ అవసరమయింది. సవరణ నియయాలను అధికరణ 243(ఎమ్) షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తించకుండా చేస్తోంది. ఆదివాసీ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ సంస్థల మౌలిక స్వరూపం, వాటి అధికారాలు సూచించవలసిందిగా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ దిలీప్‌సింగ్ భూరియా అధ్యక్షతన కమిటీని నియమించింది. షెడ్యూల్డు ప్రాంతాల్లో గ్రామసభలకు విస్తృత అధికారాలు సిఫార్సు చేస్తూ భూరియా కమిటీ 1995లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సహజ వనరుల నిర్వహణ, నియంత్రణాధికారం, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూమి సేకరణ విషయంలో గ్రామసభ అనుమతి ఉండాలని సిఫార్సు చేసింది. జిల్లా అటానమస్ కౌన్సిళ్ళ నియంత్రణలో పోలీసు, ఎక్సైజ్, రెవిన్యూ వంటి ప్రభుత్వ శాఖలు పనిచేయాలని కోరింది. ఆదివాసీ ప్రాంతాల్లో గ్రామాల పునర్వ్యవస్థీకరణ- వారి సంప్రదాయక, ఆచార, సాంస్కృతిక, జనాభా ప్రాతిపదికన జరగాలని కమిటీ సిఫార్సు చేసింది. వనరుల ఆధారిత పరిశ్రమలలో గ్రామ ప్రజల భాగస్వామ్యం గుర్తించాలని కమిటీ నివేదికలో పేర్కొంది. అయితే ఆదివాసుల స్వయంపాలనకు భూరియా కమిటీ చేసిన సిఫార్సులను ప్రభుత్వాలు అమలు చేయలేదు. భూరియా కమిటీ సిఫార్సులు యధావిధిగా అమలుచేయకుండా కేంద్ర ప్రభుత్వం 1996లో పంచాయతీల విస్తరణ చట్టం(పెసా) దేశ షెడ్యూల్డు ప్రాంతాలలో అమలులోకి తెచ్చింది. ఈ చట్టం మౌలిక నిర్మాణాన్ని, అధిగమించకుండా షెడ్యూల్డు ప్రాంతాలకు అనువైన రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టాలు రూపొందించుకునే అధికారం ఆయా రాష్ట్రా ప్రభుత్వాలకు ఇచ్చింది. కేంద్రచట్టాన్ని ఆధారంచేసుకొని రాష్ట్రప్రభుత్వం 1998లో షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తింపజేస్తూ పంచాయతీరాజ్ (సవరణ) చట్టం చేసింది.

అయితే రాష్ట్ర పెసా చట్టం అమలు కోసం 2011 వరకూ ఎటువంటి నియమాలు రూపొందించకుండా ప్రభుత్వం కాలయాపన చేసింది. నియమాలు రూపొందిన అనంతరంకూడా పెసా చట్టం కింద పేర్కొనబడిన గ్రామసభ, గ్రామపంచాయతీ, మరియు మండల ప్రజాపరిషత్ అధికారాలు అమలు కావడంలేదు.

ముఖ్యంగా పస్తుత షెడ్యూల్డు ప్రాంత పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సామాజిక, ఆర్థిక అభివృద్ధి ప్రణాళికల అమలుకు గ్రామసభల అనుమతి అవసరం. గ్రామసభ పరిధిలో సామాజిక, ఆర్థిక చేయూతనిచ్చే వివిధ అభివృద్ధి పథకాలు, పేదరిక నిర్మూలన, ఉపాధిహామీ పథకాల పనులు, లబ్దిదారులను గుర్తించడం, ఎంపిక చేయడం వంటి అధికారాలు గ్రామసభలకు ఇవ్వబడ్డాయి. అలాగే చిన్నతరహా అటవీ ఉత్పత్తులపై యాజమాన్య హక్కు , చట్ట విరుద్ధంగా అన్యాక్రాంతం అయిన గిరిజనుల భూమిని, తిరిగి అప్పగించే అధికారం, మద్యపాన నిషేధం, అమ్మకాలపై నిర్ణయాధికారం, వివాదాలు పరిష్కరించుకునే అధికారం, చిన్నతరహా నీటి వనరుల నిర్వహణ విషయాలపై గ్రామసభలు చర్చించి తగువిధంగా నిర్ణయాలు తీసుకొని, అమలు చేసుకొనేఅధికారం గ్రామసభలకు ఉంది. లఘు ఖనిజాల తవ్వకాలకు లైసెన్సులు, రాయితీలు మంజూరు చేసే అధికారం, చిన్నతరహా నీటి వనరుల నిర్వహణ, గ్రామసంతల నిర్వహణ, గిరిజన సబ్ ప్లాన్ అమలు వంటి తదితర విషయాలలో గ్రామ పంచాయతీలకు పెసా చట్టం అధికారాలు కల్పించింది. అభివృద్ధి ప్రాజెక్టులకింద చేపట్టే భూమి సేకరణ విషయంలో నిర్వాసితులు పునరావాసం, నష్టపరిహారం వంటి విషయాలలో, విద్యా సంస్థలు, వసతులు, వైద్య ఆరోగ్య సదుపాయాల పర్యవేక్షణ, గిరిజన సబ్ ప్లాన్ అమలు వంటి విషయాలపై మండల ప్రజా పరిషత్‌కు అధికారాలు ఇవ్వబడ్డవి.

అయినప్పటికీ సామాజిక, ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాల అమలు విషయంలో గ్రామసభ, పంచాయితీరాజ్ సంస్థల ప్రమేయం లేకుండానే ప్రభుత్వ పథకాలు, ప్రపంచబ్యాంకు, ఇతర అంతర్జాతీయ సంస్థల అభివృద్ధి పథకాలు ప్రభుత్వాధికారులే అమలు చేస్తున్నారు. ఆయా ప్రభుత్వ శాఖల పథకాల అమలుకు అనుగుణంగా ఆయా శాఖల అధికారుల ప్రోత్సాహం, ప్రేరణతో కమిటీలు ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నారు. గ్రామ గిరిజన అభివృద్ధి సంస్థల (వి.టి.డి.ఎ)లు, వన సంరక్షణ సమితులు, నీటి వినియోగ సంఘాలు, తల్లుల కమిటీలు, విద్యా కమిటీలు, వాటర్ షెడ్ కమిటీలు,

శ్రమ శక్తి సంఘాలు, తదితర కమిటీలు ఏర్పాటుచేసి పంచాయతీరాజ్ చట్టంలో పేర్కొన్న గ్రామసభలకు సమాంతరంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నది. ఇటువంటి సంస్థలు గ్రామసభ మరియు పంచాయతీరాజ్ సంస్థల ఉనికిని దెబ్బతీస్తున్నవి. ఇటువంటి ప్రభుత్వ చర్యలు రాజ్యాంగ విరుద్ధం. అభివృద్ధి పథకాల అమలు కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన సంఘాలు లేదా కమిటీల నిర్వహణ గ్రామసభ, పంచాయతీల అధీనంలో పనిచేస్తూ, పారదర్శకత, జవాబుదారీతనంగా ఉండే విధంగా ఉండాలి. గ్రామసభ, గ్రామపంచాయతీల సమన్వయంతో ప్రభుత్వ కమిటీలు భాద్యతలను నిర్వర్తించవచ్చు.

చిన్నతరహా అటవీ ఉత్పత్తులపై గ్రామసభలకు యాజమాన్య హక్కు ఉన్నప్పటికీ గిరిజన సహకార సంస్థ రాష్ట్ర ఏజెన్సీలో గుత్తాధిపత్యం యధావిధిగా చెలాయిస్తున్నది. పంచాయతీరాజ్ చట్టం ఉందనే భావనే ప్రభుత్వ శాఖలలో కొరవడింది.

జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్, డిఆర్‌డిఎ, ఐ.టి.డి.ఎ, గిరిజన సబ్ ప్లాన్, శాసనసభ్యుల, పార్లమెంటు సభ్యుల నిధులు వాటికి సంబంధించిన పథకాలు గ్రామసభ, ఇతర పంచాయతీరాజ్ సంస్థల అనుమతితో అమలు చేయవలసిన అవసరం ఉంటుంది.

షెడ్యూల్డు ప్రాంతాలలో పెసా చట్టం అమలు విషయంలో ఆదివాసీలు అవగాహన చేసుకొని ఉద్యమించాల్సిన పరిస్థితి నేడు నెలకొని ఉంది. ఆదివాసీల స్వయం పాలనకు ఉపకరించే కేంద్ర, రాష్ట్ర పెసా చట్టాలు మరియు నియమాలు వినియోగించుకొని ఆదివాసీలు స్వయం పాలన సాగించుకొనే దిశలో కదలాలి. ముఖ్యంగా గ్రామస్థాయిలో గ్రామసభను నిర్వహించుకొనే విధానంపై, గ్రామసభ మరియు పంచాయతీరాజ్ సంస్థల అధికారాలు ఈ ప్రచురణలో ఇవ్వబడినవి. గ్రామసభ నిర్వహణ విషయంలో మార్గదర్శిగా ఉండేందుకు గ్రామసభ కమిటీలు ఏర్పాటు, కొన్ని మోడల్ నమూనాలు అవగాహనకోసం పొందుపర్చబడినవి. పంచాయితీ రాజ్ సంస్థలకు (జిల్లా పరిషత్, మండల ప్రజా పరిషత్, గ్రామపంచాయితీలకు) అధికారాలు బదిలీ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల వివరాలను కూడా ప్రచురణలో ఇవ్వబడినవి. ఆదివాసీలకు పెసా చట్టం అమలు విషయంలో ఈ ప్రచురణ సమాచారం మరింత అవగాహనకు ఉపకరిస్తుందని ఆశిస్తున్నాను.

**పల్లా త్రినాధరావు**

# I షెడ్యూల్డు ప్రాంత పంచాయతీ రాజ్ విస్తరణ (పెసా) చట్టం - గ్రామసభ అధికారాలు

## 1. గ్రామం - గ్రామసభ

**1. షెడ్యూల్డు ప్రాంతాలలో గ్రామాలను ఎలా ప్రకటిస్తారు?**

షెడ్యూల్డు ప్రాంతాలలో గ్రామాల జాబితాను రూపొందించవలసిందిగా సంబంధిత జిల్లాల కలెక్టర్లను ముందుగా గిరిజన సంక్షేమ కమీషనరు కోరవచ్చు. ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారితో జిల్లా కలెక్టరు సంప్రదించి, రూపొందించిన గ్రామాల ప్రతిపాదనను కమీషనరు సమీక్షించిన తర్వాత, షెడ్యూల్డు ప్రాంతాల గ్రామాలుగా ప్రకటిస్తారు.

**2. "గ్రామాన్ని" ఎలా పరిగణించవచ్చు?**

ఆచార సంప్రదాయాల ప్రకారం వారి వ్యవహారాలు నిర్వహించుకుంటూ నివశిస్తున్న ప్రజల ఆవాసం లేదా ఆవాసాల సముదాయం లేదా శివారు గ్రామం లేదా శివారు గ్రామాల సముదాయాలను "గ్రామం"గా పరిగణించవచ్చు.


**3. గ్రామసభ అంటే ఏమిటి?**

గిరిజన సంక్షేమ కమీషనర్ ప్రకటించిన ప్రతీ గ్రామానికి ఒక గ్రామసభ ఉంటుంది. గ్రామస్థాయిలో ఓటర్ల జాబితాలో పేర్కొనబడిన వ్యక్తులందరూ గ్రామసభ సభ్యులుగా ఉంటారు. ఇటువంటి గ్రామసభకు స్థానిక పాలనలో కీలకమైన పాత్ర ఉంటుంది.

## 2. గ్రామసభ నిర్వహణ - పద్ధతి

**1. మొదటి గ్రామసభ ఎవరు ఏర్పాటుచేస్తారు?**

మొదటి గ్రామసభను నిర్వహించడానికి డిప్యూటీ తహసిల్దారు హోదాకు తక్కువ కానటువంటి అధికారిని ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి ఈ నియమాలు కింద నియమించాలి. గ్రామసభ సమావేశానికి సంబంధిత గ్రామ పంచాయితీ సర్పంచ్ అధ్యక్షత వహించాలి. సర్పంచ్ లేనప్పుడు సాంప్రదాయ గ్రామ పెద్ద/స్వయం సహాయక గ్రూపు గ్రామసభ సమావేశానికి అధ్యక్షత వహించవచ్చు. ఆ గ్రామసభ తొలి సమావేశంలో వైస్ ప్రెసిడెంట్, కార్యదర్శిని ఎన్నుకుంటారు.



**2. గ్రామసభ ఉపాధ్యక్షుడి, కార్యదర్శిలను ఎలా ఎన్నుకుంటారు?**

మెజార్టీ గ్రామ సభ్యులు చేతులు ఎత్తడం ద్వారా గ్రామసభ ఉపాధ్యక్షుడిని, కార్యదర్శిని ఎన్నుకోవాలి. ఉపాధ్యక్షుడు, కార్యదర్శి షెడ్యూల్డు తెగకు చెందిన వారై ఉండాలి. వారి పదవీకాలం 5 సంవత్సరాలు.

**3. తర్వాత జరిగే గ్రామసభను ఎవరు నిర్వహిస్తారు?**

తర్వాత జరిగే గ్రామసభలకు గ్రామసభ వైస్ ప్రెసిడెంట్ అధ్యక్షత వహిస్తారు. గ్రామ సభ నిర్వహణకు సెక్రటరీ భాధ్యత వహించాలి.

**4. గ్రామసభ నిర్వహణకు కోరం ఎంత?**

గ్రామసభ సభ్యులలో 1/3వ వంతు కంటే తక్కువగాకాకుండా ఉండి అందులో కనీసం 50 శాతం మంది ఎస్.టి. సభ్యులు హాజరును గ్రామసభ సమావేశానికి కోరంగా పరిగణిస్తారు.

**5. గ్రామసభను ఎన్ని సార్లు జరుపుకోవాలి?**

ఏడాదిలో కనీసం రెండుసార్లు గ్రామసభ సమావేశాలు నిర్వహించాలి. అంటే ఏప్రిల్ 14వ తేదీన, మళ్ళీ అక్టోబర్ 3వ తేదీన తప్పనిసరిగా జరపాలి. ఈ సమావేశాలు చట్టపరంగా జరుగవలసినవి.

**6. ఇంకెప్పుడు గ్రామసభలు నిర్వహించుకోవచ్చు?**

అవసారాన్నిబట్టి గ్రామసభలను ఎన్నిసార్లు కావాలనుకుంటే అన్నిసార్లు నిర్వహించుకోవచ్చు.



**7. గ్రామసభ ఎక్కడ జరపాలి?**

గ్రామంలో, గ్రామసభ సభ్యులందరికి అనుకూల సమయంలో, అనువుగా ఉన్న స్థలం వద్ద జరపాలి.

**8. గ్రామసభ సమావేశం సభ్యులకు ఎలా తెలియజేయాలి?**

గ్రామసభ జరగడానికి ముందుగానే నోటీసు ద్వారా లేదా ఇతరత్రా సంప్రాదాయ సమాచారం అందించే పద్దతిలో సభ్యులకు సమావేశం గురించి కార్యదర్శి తెలియజేయాలి. నోటీసులో గ్రామ సభ సమావేశం జరిగే స్థలం, తేది, సమయం, సమావేశంలో చర్చించబోయే అంశాలు తెలియజేస్తే సభ్యులు చర్చించడానికి వీలుంటుంది. సమావేశం జరిగే ముందు కూడా సమావేశానికి హాజరయిన సభ్యులు అందరికీ అజెండా – కార్యక్రమ వివరాల తెలియజేయాలి.

**9. ఎవరు పాల్గొనాలి?**

గ్రామ సభ సభ్యులు అందరూ గ్రామసభలో పాల్గొనాలి. స్త్రీలు, ఒంటరి మహిళలు, ఇతర బలహీన, అశక్తతకు గురయిన వర్గాల వారందరూ తమ నిర్ణయాలు స్వేచ్ఛగా తెలియజేసే విధంగా గ్రామసభ నిర్వహించాలి.

**10. గ్రామసభ రిజిస్టరు**

సమావేశాలలో ఆమోదించిన గ్రామసభ తీర్మానాలను ఒక రిజిస్టరులో నమోదు చేసుకోవాలి. గ్రామసభ కార్యదర్శి/ఉపాధ్యక్షుడు సందర్భాన్ని బట్టి సభ్యుల సంతకం/వేలిముద్రలను తీసుకోవాలి. మీటింగ్ నోటీసు, హాజరు పట్టీ, గ్రామసభ కార్యక్రమావళికి సంబంధించి గ్రామ కార్యదర్శి రిజిష్టర్లు నిర్వహించాలి.

**11. గ్రామసభ నిర్ణయాలు ఎలా పొందుపరచాలి?**

గ్రామసభలో చర్చించిన అంశాలు మినిట్స్ పుస్తకంలో అందరికీ అర్థమయ్యే భాషలో వ్రాయాలి. గ్రామసభ సమావేశం ముగిసిన అనంతరం గ్రామసభ నిర్ణయాలను కార్యదర్శి చదివి వినిపించి, సభ్యుల ఆమోదం పొందాలి. ప్రతీ తీర్మానపు అంశాన్ని ప్రత్యేకంగా వ్రాసి ఆమోదం లేదా ఇతరత్రా వాటితో కలిపి గ్రామసభ ఆమోదం పొందాలి. సభ్యులు తమ ఆమోదాన్ని చేతులు ఎత్తడం ద్వారా తెలియజేయాలి.

**12. తీర్మానాలు ఎవరికి పంపాలి?**

గ్రామసభ ఆమోదించిన తీర్మానాలను నెల లోపు గ్రామసభ కార్యదర్శి సంబంధిత ప్రభుత్వ శాఖలకు/సంస్థలకు తగుచర్యలు నిమిత్తం పంపాలి.

**13. గ్రామసభ కమిటీలు ఏర్పాటు:**

గ్రామసభ తీర్మానాలు అమలు జరుపుకోవడానికి గ్రామసభ ఎంపిక చేసిన గ్రామసభ సభ్యులతో వివిధ గ్రామసభ కమిటీలు ఏర్పర్చుకోవచ్చు. గ్రామసభ కార్యదర్శి పంపిన గ్రామసభ తీర్మానాలు అమలు కోసం సంబంధిత అధికార్లతో, వ్యక్తులతో మాట్లాడి అనుకూల నిర్ణయాలు పొందేందుకు గ్రామకమిటీలు భాధ్యత తీసుకోవాలి. తీర్మానాల అమలు ప్రక్రియలో కమిటీలు గ్రామసభకు మరియు సంబంధిత అధికార్లకు మధ్య సంధానకర్తగా వ్యవహరించవచ్చు.

**ఇతర కమిటీలతో సమన్వయం:**

ప్రస్తుతం గ్రామాలలో ఏర్పరిచిన నీటివినియోగ సంఘం, విద్యా కమిటీలు, వాటర్‌షెడ్ అభివృద్ధి కమిటీ, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయ సంఘాలు, తల్లుల కమిటీ, స్వయం సహాయక సంఘాలు (ఎస్.హెచ్.జి), డ్వాక్రా గ్రూపులు, వెలుగు, గ్రామ సమాఖ్య (వి.ఓ), వనసంరక్షణ సమితి వంటి వివిధ ప్రభుత్వ ప్రమేయంతో ఏర్పడిన కమిటీలు ఆయా సంఘాల ప్రతిపాదనలు గ్రామసభ ముందు ఉంచి ప్రజల అభిప్రాయాన్ని, నిర్ణయానికి అనుగుణంగా అమలు చేయాల్సిఉంటుంది. గ్రామసభ నిర్ణయాలు అమలు విషయంలో గ్రామసభ కమిటీలు కూడా ప్రభుత్వం ఏర్పర్చిన కమిటీల సమన్వయంతో పనిచేయవచ్చు. ఆ విధంగా జరిగితేనే ప్రజల మనోభావాలకు, నిర్ణయాలకు గ్రామసభ తీర్మానం అద్దంపట్టినట్లవుతుంది. గ్రామాలలో స్వావలంబన, ఆదివాసీల స్వయంపాలన, సాధికారిత రూపుదిద్దుకోవడానికి వీలవుతోంది.

## గ్రామసభల కమిటీలు- బాధ్యతలు.

**1. సహజ వనరుల కమిటీ:** గిరిజన, గిరిజనేతర భూమి వివాదాలు, అటవీ హక్కుల గుర్తింపు, భూమి లేని పేదలకు ప్రభుత్వ భూమి అస్సైన్‌మెంట్, పట్టా ఉండి భూమి స్వాధీనంలో లేకపోవడం, స్వాధీనం ఉండి పట్టా లేని సమస్యలు, భూమి, అటవీ భూమి అభివృద్ధి, భూమి వినియోగంలో మార్పు, చిన్న తరహా నీటి వనరులు నిర్వహణ, వాటి



సద్వినియోగం వంటి అంశాలకు సంబంధించిన గ్రామసభ చేసిన తీర్మానాలు అమలు అయ్యేలా కమిటీ కృషిచేయవచ్చు.

**2. ఆరోగ్య/విద్యా కమిటీ:** ఐ.సి.డి.ఎస్ కార్యక్రమాలు, గ్రామస్థాయి మెడికల్ సిబ్బంధి పనితీరు, ఆరోగ్య, వైద్య సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలు మరియు పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు, నిర్వహణ, పాఠ్యపుస్తకాలు అందుబాటు, విద్యాహక్కుల చట్టం కింద పేర్కొనబడిన మౌలిక సదుపాయాలు/హక్కులు, బడిమానిన పిల్లలు పాఠశాలలో చేర్పించే విషయంలో, కుల ధృవీకరణ పత్రాల మంజూరుకు సంబంధించిన గ్రామసభ తీర్మానాలు ఆరోగ్య, విద్యా కమిటీలు అమలు కోసం ప్రయత్నించవచ్చు.

**3. మౌలిక సదుపాయాల కల్పన కమిటీ:** విద్యుత్తు, రహదార్లు, మురుగు కాలువల్లు, రక్షిత మంచినీటి పథకాలు, కమ్యూనిటీ భవనం, పాఠశాల/ అంగన్ వాడీ భవనాలు, ఇతరత్రా మౌలిక సదుపాయాల విషయంలోమౌలిక సదుపాయాల కల్పన కమిటీ గ్రామసభ నిర్ణయాలు అమలు కోసం ప్రయత్నించవచ్చు.

**4. మార్కెటింగ్ కమిటీ:** గిరిజనులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు సేకరించుకున్నఅటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, విలువాధారిత వ్యవసాయ, అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్, వస్తుమారక విషయంలోధరల అంచనా, తదితర మార్కెటింగ్‌కు సంబంధించిన విషయాలలో గ్రామసభ చేసిన తీర్మానాల అమలు కోసం మార్కెటింగ్ కమిటీ భాధ్యత తీసుకోవచ్చు.

**5. నిఘా, పర్యవేక్షణా కమిటీ:** గ్రామసభ తీర్మానాల మేరకు ప్రభుత్వ పథకాలు అమలు మరియు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పనులు నిర్వహణపై నిఘా, పర్యవేక్షణ, సంబంధిత క్షేత్రస్థాయి నివేదికలు/ వివరాలు గ్రామసభ ముందు ఉంచటం వంటి బాధ్యత కమిటీ చేపట్టవచ్చు.

**6. గిరిజన సాంస్కృతిక కమిటీ:** గిరిజన ఆచార, సాంప్రదాయ పరిరక్షణ, గిరిజన సంప్రదాయ వేడుకల నిర్వహణ, సంప్రదాయ వివాద పరిష్కారం సంబంధించిన గ్రామసభ తీర్మానాలను గిరిజన సాంస్కృతిక కమిటీ అమలు కోసం బాధ్యత తీసుకోవచ్చు.

**7. న్యాయ వ్యవహారాల కమిటీ:** న్యాయ సలహాలు మరియు సహాయం పొందే విషయంలో గ్రామసభకు ఇతర న్యాయవాదులకు/ప్రభుత్వ సంస్థలకు మధ్య సంధానకర్తగా కమిటీ వ్యవహరించవచ్చు. గ్రామసభ తీర్మానాల న్యాయబద్ధత విషయంలో తగు సూచనలు, సలహాలు పొందే విషయంలో న్యాయ వ్యవహారాల కమిటీలు భాధ్యత తీసుకోవచ్చు. గ్రామసభ తీర్మానాల మేరకు న్యాయ వ్యవహారాల కమిటీ వ్యవహరించాల్సి ఉంటుంది.

## 3. గ్రామసభ తీర్మానాలపై సమీక్ష:

(i) గ్రామసభ తీర్మానాన్ని విబేధించే వ్యక్తి లేదా సంస్థ అట్టి తీర్మానం ఆమోదం పొందిన 60 రోజుల్లోగా గిరిజన సంక్షేమ కమీషనరుకు అప్పీల్ చేసుకోవచ్చు. గ్రామసభ నిర్ణయానికి సంబంధించి వాస్తవికత లేదా చట్ట బద్ధత గురించి విచారణ జరిపి, గిరిజనుల ప్రయోజనాలకు హాని జరగకుండా ఉండే ఆదేశాలు కమీషనరు జారీ చేయవచ్చు.

(ii) కమీషనరు జారీచేసిన ఆదేశాలపై అభ్యంతరాలుఉంటే అవి వెలువడిన 90 రోజులల్లోగా ప్రభుత్వాన్ని పునఃవిచారణ జరపమని పిటీషన్ దాఖలు చేయవచ్చును.

(iii) కమీషనర్ ఉత్తర్వులను సమీక్షించి గిరిజనుల ప్రయోజనాల హని కలుగకుండా తగు ఉత్తర్వులు జారీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

## గ్రామసభ నిర్వహణ - గుర్తుంచుకోవలసిన అంశాలు

i గ్రామసభ నిర్వహణలో గ్రామ సభ తేది నిర్ణయించడం ముఖ్యమైనది. అందరికీ ఆమోదయోగ్యమైన తేది నిర్ణయించుకోవాలి.

ii గ్రామసభ నిర్వహణ తేది, కొంత గడువు ముందు తెలియజేయాలి.

iii యువకులు, స్త్రీలు, అన్ని వర్గాల వారు హాజరుయ్యేలా చూసుకోవాలి.

iv గ్రామసభ నిర్ణయాలు అందరికీ తెలియావచ్చేలా ఎక్కడైనా పొందుపర్చాలి. రానివారు తెలుసుకోగల్గుతారు.

v అంతకు ముందు జరిగిన గ్రామ సభ విశేషాలు తదుపరి గ్రామసభలో తెలియజేసుకోవచ్చు.



vi గ్రామసభ హాజరు పట్టి నిర్వహించాలి.

vii చర్చల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనేలా చూడాలి.

viii గ్రామసభలో ఎజెండా అంశాలు దేనికదే విడివిడిగా చర్చించి, తీర్మానాలు చేయాలి.

ix కోరం వచ్చేలా చూసి సభ నిర్వహించుకోవాలి (కోరం అంటే గ్రామసభ మొత్తం సభ్యులలో 1/3 వంతు సభ్యులు హాజరు కావాలి. అందులో కనీసం సగం గిరిజనులు ఉన్నప్పుడే గ్రామ సభ నిర్వహించాలి).

x గ్రామసభ తీర్మానాలు పుస్తకములలో వ్రాసుకోవాలి.

xi గ్రామసభ తీర్మానాల కాపీలను నాలుగు వారాలలోగా సంబంధిత అధికార్లకు పంపించాలి.

## 4. గ్రామసభ మౌలిఖఅధికారాలు (సమీక్ష, పర్యవేక్షణ, నిర్ణయాధికారం)

## గ్రామసభ నిర్ణయం కోసం ముందుంచాల్సిన అంశాలు:

**1. గ్రామ వ్యవసాయ ఉత్పాదక ప్రణాళికలు:** గ్రామంలో ఏయే పండ్ల తోటలు, ఆహారపంటలు, అటవీ ఫలసాయం ఇచ్చే మొక్కలు వేసుకోవాలి? వ్యవసాయ పద్ధతులు వాటికి సంబంధించిన వ్యవసాయ ప్రణాళికలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడానికి వ్యవసాయ ఉత్పాదక ప్రణాళికలు గ్రామసభ ముందు ఉంచాలి.

**2. గ్రామాలలో ఉన్న ఉమ్మడి భూముల జాబితా:** గ్రామానికి చెందిన పోరంబోకు భూములు మరియు ఇతర సంబంధిత వివరాలు గ్రామసభ ముందు ఉంచాలి. గ్రామకంఠం, పోరంబోకు భూములు,చెర్వులు, సంప్రదాయ భూములు, మగనాల మెట్ట, పశువుల మేత ప్రదేశాలు, పుంతలు, ఫలసాయం ఇచ్చే వృక్షాలు, తోపులు, పంట నూర్చుకొనే స్థలాలు, స్మశాన వాటికలు వంటి వాటి వివరాలపై గ్రామసభ చర్చించి వాటి వినియోగంపై తగు నిర్ణయాలు తీసుకోవచ్చు.

**3. ఇంటి, ఇతర స్థిరాస్థుల యాజమాన్యాల బదలాయింపులు:** గ్రామంలో ఇండ్లు, భూముల అమ్మకాలు, కొనుగోలు ఇతరత్రా బదలాయింపులు

జరిగితే వాటికి సంబంధించిన కొనుగోలు, అమ్మకందార్ల పేర్లు మరియు గిరిజనులు కాకపోతే ఆయా గిరిజనేతర్ల పేర్లు, చిరునామా, భూముల వివరాలు (సర్వే నెంబరు, విస్తీర్ణం, పట్టా), భూమి విక్రయధర, తదితర వివరాలు గ్రామసభ ముందుంచాలి. గ్రామసభ యాజమాన్యం బదలాయింపుల వల్ల కలిగే పర్యావసనాలు సమీక్షించి తీర్మానం చేయవచ్చు.

**4. గ్రామ పంచాయతీ ఆమోదించిన బడ్జెట్ అంచనాల ఆడిట్ నివేదికలు:** గ్రామ పంచాయతీ గతంలో తలపెట్టిన కార్యక్రమాలను కూడా గ్రామసభలు సమీక్షిస్తాయి. గ్రామ పంచాయతీ జమ,ఖర్చులు, వివరాలుపై ఆడిట్ నివేదిక గ్రామ సభకు సమర్పించవలసి వుంటుంది. గత సంవత్సరం అమలు చేసిన కార్యక్రమాల నివేదిక కూడా గ్రామసభ ముందుంచవలసి వుంటుంది. గత సంవత్సరం గ్రామ పంచాయతీ చేపట్టిన పనుల తీరు, పరిస్థితిని పరిశీలించేందుకు సభ్యులకు అవకాశం ఉంటుంది. గ్రామసభలో ప్రతీ అంశాన్ని చర్చించి, నిర్ణయాలు తీసుకోవడంతో గ్రామపంచాయితీ నిర్వాహకుల జవాబుదారీ, పారదర్శకత పెరుగుతోంది. మంచి గ్రామ పరిపాలనకు దారితీస్తుంది. పంచాయితీ, ప్రభుత్వ అధికార్ల భాధ్యత పెంచుతోంది.

**5. గ్రామ పంచాయతీకి పన్నులు, రుసుముల బకాయిలు ఉన్న బకాయిదారుల జాబితా:** గ్రామసభ సభ్యులు గ్రామ పంచాయితీకి చెల్లించాల్సిన పన్నులు, బకాయిదార్ల జాబితా తయారు చేసి గ్రామసభ చర్చించాలి. పన్నుల చెల్లింపు జరిగేలా ప్రయత్నించాలి.

**6. చౌక ధర దుకాణం/ డి.ఆర్.డిపో పనితీరు:** గ్రామంలో కుటుంబాల వారీగా రేషన్ కార్డులు, వాటిపై పేర్కొన్న రేషను వివరాలు తెలుసుకోవాలి. గ్రామానికి కావలసిన మొత్తం రేషను ఎంత? ఆవిధంగా గ్రామానికి రేషన్ వచ్చిందాలేదా తెలుసుకోవాలి. వచ్చిన రేషన్ బియ్యం, కిరోసిన్, ఇతర వస్తువులు రిజిస్టర్‌లో సెల్స్ మెన్ సమోదు చేసాడా లేదా? ప్రభుత్వం పంపిన రేషన్ కార్డులో పేర్కొన్న విధంగా సరఫరా అవుతున్నదీ లేనిదీ పర్యవేక్షించాలి. డిపో సక్రమ నిర్వహణ, ప్రజలకు అనుకూల సమయంలో నిర్వహిస్తున్నదీ లేనిదీ గ్రామసభ సమీక్షించవచ్చు.



**7. అంగన్‌వాడీ పనితీరు:** అంగన్‌వాడీ కేంద్రం సక్రమంగా నిర్వహిస్తున్నదీ లేనిదీ చూడాలి. పిల్లలకోసం ప్రభుత్వం రూపొందించిన ఐ.సి.డి.ఎస్, మరియు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు అమలవుతున్నాయా లేదా తెలుసుకోవాలి. ప్రభుత్వ పథకాలు ఆశించిన లక్ష్యం నెరవేరుతున్నదీ లేనిదీ గ్రామసభలు సమీక్షించవచ్చు.

**8. సబ్ సెంటర్స్ పనితీరు:** అదే విధంగా సబ్ సెంటర్ల పనితీరు, అవి అందించాల్సిన సదుపాయాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవచ్చు.

**9. పాఠశాలల/ సంక్షేమ హాస్టళ్ళ పనితీరు:** పాఠశాలలు మరియు సంక్షేమ హాస్టల్స్ సక్రమంగా నిర్వహిన్నదీ లేనిదీ పర్యవేక్షించవచ్చు. పాఠశాలలకు టీచర్ క్రమంగా వస్తున్నారా లేదా? పాఠ్యాంశాలు బోధన సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ తెలుసుకోవాలి. విద్యాహక్కు చట్టం కింద మౌలిక వసతులు, హక్కుల అమలు గ్రామసభలు సమీక్షించి నిర్ణయాలు తీసుకోవచ్చు.

**10.తాగునీటి సౌకర్యం:** గ్రామంలో ఉన్న త్రాగునీటి సౌకర్యాలు సమీక్షించాలి. కలుషిత నీరు తాగితే అనారోగ్యానికి గురవుతారు. రక్షిత మంచినీటి పథకాల అమలు కోసం గ్రామసభలు చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవచ్చు. తాగునీటి సౌకర్యం పౌరుల హక్కుగా గ్రామసభ గుర్తించాలి.

**11.విద్యుత్ సౌకర్యం:** గ్రామంలో విద్యుత్ సరఫరా, విద్యుత్ సౌకర్యం వంటి సమస్యలపై గ్రామసభ తీర్మానాలు చేయవచ్చు.

**12. ఇతర అభివృద్ధి కార్యక్రమాలు.**

**(ఎ) గ్రామాభివృద్ధి - ప్రణాళిక:** ప్రతి కుటుంబ సామాజిక, ఆర్థిక పరిస్థితులను తెలియపరిచే వివరాలు రూపొందించిన గ్రామ ముఖ చిత్రాన్ని గ్రామసభ ఆమోదించాలి.వ్యక్తిగత/సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి వాటిని అమలు చేయడంలో గ్రామసభ భాగస్థులుగా చేయాలి. సామాజిక, ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలు అమలుకు గ్రామసభ అనుమతి అవసరం.

గ్రామ అభివృద్ధి ప్రణాళికలు తయారుచేసుకొనే ముందు గ్రామంలో ఉండే వనరులు, ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితిని సమీక్షించుకోవాలి.

గ్రామ ప్రజలు అందరూ కలసి అవగాహన చేసుకొనేందుకు సామాజిక చిత్రపటం తయారు చేసుకోవచ్చు, గ్రామసభ అనుమతితోనే అభివృద్ధి ప్రణాళికలు అమలు చేయాలి. గ్రామసభ భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పథకాల రచన సాగాలి. పెసా చట్టం ప్రభుత్వ పథకాల లబ్దిదారులను గుర్తించి, ఎంపికచేసే అధికారం గ్రామసభలకు ఇచ్చింది. దీంతో లబ్ధిచేకూరవలసిన వ్యక్తులకు లబ్ది చేకూర్చే అవకాశం ఉంటుంది. గ్రామ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు గ్రామ పంచాయితీలు/ఇతర ప్రభుత్వ శాఖలు అమలు చేస్తాయి. అమలు చేయడంలో అయ్యేఖర్చు విషయంలో గ్రామసభకు జవాబుదారీగా పంచాయితీలు /ప్రభుత్వ అధికారులుఉండాలి. గ్రామసభకు విడుదల చేసిన నిధులు విషయంలో సంబంధిత సంస్థ/ప్రభుత్వ శాఖకు నిధుల వినియోగ ధృవ పత్రాన్ని సమర్పించాలి. (మోడల్ నమూనా చూడవచ్చు)

**(బి)చిన్న తరహా నీటి వనరుల నిర్వహణ:**

ప్రజల సమిష్టి - ప్రయోజనాల కోసం చిన్న తరహా నీటి వనరుల ప్రణాళిక మరియు నిర్వహణ భాధ్యత గ్రామసభపై ఉంటుంది. కొత్త నీటి వనరుల ఏర్పాటు కూడా చిన్నతరహా నీటి వనరుల ప్రణాళికలో భాగంగానే చూడాలి.

**గ్రామసభ చర్చించుకోవలసిన అంశాలు:** సాగుభూమి విస్తీర్ణం ఎంత? వాటికి సాగునీటి సదుపాయ అవకాశాలు వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే విషయాలపై చర్చించుకోవచ్చు. కొండలపై కురిసిన వర్షపు నీరు నిరుపయోగంగా పొర్లిపోతుంది. నీటి వనరులు సద్వినియోగం చేసుకొనే విధంగా చెక్‌డామ్‌లు ఇతర నీటి నిల్వ నిర్మాణాలు నిర్మించుకోవడం వంటి చర్యలు విషయంలో గ్రామసభ చర్చించి తీర్మానాలు చేయవచ్చు. అలానే తాగునీటికోసం నీటివనరుల వినియోగం గురించి, చెర్వులలో చేపల పెంపకం ద్వారా జీవనోపాధి మెరుగుకోసం గ్రామసభ చర్చించవచ్చు. గ్రామస్థాయిలో చిన్నతరహా నీటివనరుల వినియోగంపై సమీక్ష జరిపి కార్యక్రమాలు రూపొందించి అమలు జరపటం వంటి విధులు గ్రామసభ నిర్వర్తించవచ్చు.

**(సి) చిన్న తరహా అటవీ ఉత్పత్తుల యాజమాన్యం మరియు విక్రయము:**

చిన్న తరహా అటవీ ఉత్పత్తుల యాజమాన్యంపె గ్రామసభకు హక్కు ఉంటుంది. చిన్న తరహా అటవీ ఫలసాయం కొనుగోలు విషయంలో



గిరిజన సహకార సంస్థకు గుత్తాధిపత్యం ప్రభుత్వం కల్పించింది. గిరిజనులకు గిట్టుబాటుధర చెల్లించి మధ్యదళారీల దోపిడీ నుంచి విముక్తి చేసేందుకు జి.సి.సి (గిరిజన సహకార సంస్థ)కు అధికారం ఇచ్చింది. అయితే గిరిజనులు సేకరించుకొంటున్న చిన్నతరహా అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర చెల్లించడంలో మరియు దళారుల దోపిడీ నుండి కాపాడే విషయంలో జి.సి.సి విఫలమయింది. జి.సి.సి గిట్టు బాటు ధర చెల్లించకపోతే ఎవరు ఎక్కువ ధర చెల్లిస్తే వారికే గ్రామసభ తీర్మానం మేరకు అమ్మవచ్చు. అయితే గిరిజనులు సేకరించుకుంటున్న అటవీ ఉత్పత్తుల గిట్టుబాటు ధరల విషయంలో ఇతరులు మోసగించకుండా రక్షణ కల్పించే విషయంలో జి.సి.సి భాధ్యత కొనసాగించవచ్చు.



**అటవీ ఉత్పత్తులు సేకరణదారుల వివాద పరిష్కారం:**

చిన్నతరహా అటవీ ఉత్పత్తులు సంప్రదాయక సేకరణ, యాజమాన్యం, వినియోగం సంబందించిన హద్దుల విషయంలో ఏదైనా వివాదం తలెత్తినప్పుడు పరిష్కారం కోసం సేకరణదారుడు పరిష్కారం కోసం గ్రామసభను కోరవచ్చు. అటువంటి సేకరణదారులనుండి చిన్నతరహా అటవీ ఉత్పత్తి యాజమాన్య హక్కులపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వివాదాన్ని పరిష్కరిస్తూ గ్రామసభ ఒక తీర్మానాన్ని చేయవచ్చు.

గ్రామసభ తప్పనిసరిగా చిన్నతరహా అటవీ ఉత్పత్తి సేకరణదారుల పేర్లతో కూడిన రిజిస్టరును నిర్వహించాలి. గ్రామసభ కనీసం అమ్మకం ధర కూడా చిన్నతరహా అటవీ ఉత్పత్తులకు ప్రకటించుకోవచ్చు. లేదా ఇతరత్రా బయట దొరికే మారకం విలువనుబట్టి వస్తుమార్పిడికి ధర నిర్ణయించుకొని తీర్మానించుకోవచ్చు. పంచాయితీలో ఉండే అన్ని గ్రామసభలు ఉత్పత్తుల గిట్టుబాటు ధర విషయంలో చర్చించుకొని తీర్మానం చేసుకుంటే బాగుంటుంది. సేకరించుకొన్న అటవీ ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతుంది. దళారీల మోసం తగ్గుతుంది.

సేకరణదారులు, చిన్న తరహా అటవీ ఉత్పత్తిదారులు బయట మార్కెటులో అమ్ముకొనేందుకు గ్రామసభ రవాణా పర్మిట్‌లు కూడా జారీచేయవచ్చు. చిన్న తరహా అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకందార్లకు ఇతరుల నుంచి వచ్చే అంటంకాలు అధిగమించడానికి గ్రామసభ అండగా ఉండవచ్చు.

అటవీ ఫలసాయం ఇచ్చే మొక్కల పెంపకం విషయం గ్రామసభ తీర్మానాలు చేసి వాటి అమలుకు అటవీ శాఖను కోరవచ్చు. చిన్న తరహా అటవీ ఉత్పత్తుల సేకరణ క్రమబద్ధీకరణకు సంబంధించిన నియమాలు కూడా ఏర్పర్చుకోవచ్చు. అటవీ ఫలసాయం ఇచ్చే చెట్లు పునరిజ్జీవంకోసం, రక్షణ కోసం నిర్ణయం తీసుకోవచ్చు. ఈ చర్చలన్నీ చిన్నతరహా అటవీ ఫలసాయ యాజమాన్యం హక్కులో భాగాంగానే చూడవచ్చు.

**(డి) భూముల అన్యాక్రాంతం నిరోధించడం మరియు అన్యాక్రాంతం కాబడిన గిరిజనుల భూమిని తిరిగి స్వాధీనం చేయడం:**

షెడ్యూల్డు ప్రాంతాల్లో గిరిజనుల, గిరిజనేతరుల మధ్య భూమి బదలాయింపులు చెల్లవు. అలాగే గిరిజనేతర్లు, గిరిజనేతర్ల మధ్య కూడా భూమి బదలాయింపులు చెల్లవని 1/70 నిబంధనలు స్పష్టంచేస్తున్నాయి. గిరిజనుల భూమి రక్షణకు రూపొందించిన భూమి బదలాయింపు నిబంధనలు 1/70 సరిగ్గా అమలుకు నోచుకోవడంలేదు. దీని కారణంగా గిరిజనుల భూమి అన్యాక్రాంతం జరుగుతుంది. గిరిజనుల భూమి తిరిగి రాబట్టుకోవడంలో గిరిజనులు విఫలయత్నం చేస్తున్నారు. గిరిజనుల భూమి అన్యాక్రాంతాన్ని నిరోధించడంలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమయింది. గిరిజనుల భూమి అన్యాక్రాంతాన్ని నిరోధించే హక్కు



అన్యాక్రాంతం కాబడిన భూమిని చట్టబద్ధంగా తిరిగి రాబట్టేందుకు గ్రామసభకు అధికారం పంచాయితీరాజ్ చట్టం (పెసా) కల్పించింది.

**(1) భూమి విషయంలో గ్రామసభ నిర్వహించవలసినవి:**

(ఎ) సాగుదార్లుతో సహా పట్టాదారుల పేర్లు కలిగివున్న భూమి విస్తీర్ణం వివరాలతో కూడిన భూ కమతాదారుల జాబితాను తయారుచేసుకోవచ్చు.

(బి) సామాజిక హోదా, పట్టాదార్లు, నిజమయిన గిరిజనుడో కాదా అనే విషయాన్ని పరిశీలించవచ్చు.

(సి) గిరిజన మహిళ పేరిట భూములు కొనుగోలు చేసి, గిరిజనేతరుడు అనుభవిస్తున్నదీ లేనిదీ పరిశీలించవచ్చు.

(డి) అవసరమనుకుంటే క్షేత్రస్థాయిలో భూములను గిరిజనులు సాగుచేస్తున్నదీ లేదా ఇతరాత్రా తీసుకున్న భూములను గిరిజనేతర్లు సాగు చేస్తున్నదీ పరిశీలించే అధికారం ఉంటుంది.

(ఇ) ప్రభుత్వ భూమి అస్సైన్‌మెంటు కోసం లబ్ధిదారుల జాబితాను ఆమోదించే అధికారం.

(ఎఫ్) సమగ్ర దర్యాప్తు అనంతరం భూముల ఆక్రమణలు భూ బదలాయింపు క్రమబద్ధీకరణ నిబంధనలు(1 ఆఫ్ 1970) కి విరుద్ధంగా ఉన్నాయని సంతృప్తి చెందినట్లయితే, గ్రామసభ ఒక తీర్మానాన్ని చేయవచ్చు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గిరిజన సంక్షేమం) లేదా ఆర్.డి.ఓ కి తదుపరి చర్యలు నిమిత్తం పంపించవచ్చు.

(2) బూముల స్వాధీన విషయంలో తలెత్తే వివాదాలను గ్రామసభ సమావేశాన్ని నిర్వహించి, విచారణ జరిపి తదుపరి చర్యలు చేపట్టవలసిందిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లేదా ఆర్.డి.ఓను కోరుతూ తీర్మానం చేయవచ్చు.

(3) గిరిజనుల భూమి అన్యాక్రాంతం జరిగిందని ఏదైనా ఫిర్యాదుపై లేదా స్వయంగానే గ్రామసభ సమావేశాన్ని నిర్వహించి, ఆ భూమిని తిరిగి గిరిజనులకు స్వాధీనం చేసేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లేదా ఆర్.డి.ఓ చర్యలు నిమిత్తం సముచిత తీర్మానం చేసి పంపించవచ్చు.

(4) గ్రామసభ తీర్మానాన్ని విభేధించేవారు తీర్మానం తేదీనుండి 60 రోజుల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లేదా ఆర్.డి.ఓ అధికారికి ఒక పిటీషను దాఖలు చేసుకోవచ్చు.

(5) 1 ఆఫ్ 1970భూమి బదలాయింపు క్రమబద్ధీకరణ నిబంధనల క్రింద వ్యవహరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లేదా ఆర్.డి.ఓ అధికారి పిటీషనును అనుమతించడం లేదా తిరస్కరించడం లేదా పునఃపరిశీలన కోసం తిరిగి సంబంధిత గ్రామసభకు పంపవచ్చు.

(6) అలా పంపబడిన పిటీషనును 30 రోజులలోపు గ్రామసభ సమావేశమై, వాదనలు విన్న తర్వాత నిర్ణయాన్ని, తీర్మాన రూపంలో ఆ అధికారికి పంపవచ్చు.

(7) గ్రామసభ తీర్మానాన్ని పరిశీలించి, పిటీషనును ఆమోదిస్తూ లేదా తిరస్కరిస్తూ సముచిత ఉత్తర్వును ఆ అధికారి జారీ చేయవచ్చును.

(8) 1 ఆఫ్ 1970 భూమి కేసుల్లో తప్పనిసరిగా సంబంధిత గ్రామసభను అభిప్రాయం కోసం భాగస్థులుగా చేయాలి. గ్రామసభ అభిప్రాయాన్ని తగురీతిలో విచారించాలి.

(9) ప్రతీ గిరిజన, గిరిజనేతర భూమి కేసుల్లో తీర్పు ప్రతులను సంబంధిత గ్రామసభకు విచారణాధికారి పంపించాలి.



(10) గిరిజనునికి భూమి తిరిగి అప్పగించే సమయంలో జరిపే పంచనామా పత్రాలపై గ్రామసభ సభ్యుని నుంచి సంతకాన్ని తీసుకోవాలి.



**(ఙ) ఎక్సైజ్:**

1. గ్రామంలో మద్యం ఉత్పత్తి లేదా తయారీ కోసం మద్యం ఉత్పత్తి యూనిట్‌ను నెలకొల్పాలనే ఉద్దేశ్యంపై ఎక్సైజ్ శాఖ గ్రామ సభ అభిప్రాయం కోరాలి. గ్రామసభ 4 వారాలలోపు ఒక తీర్మానం రూపంలో తమ అభిప్రాయాన్ని తెలియజేయాలి. గ్రామసభ తీర్మానం ఆధారంగా గ్రామంలో మద్యం ఉత్పత్తి/తయారీ విషయంలో ఎక్సైజ్ శాఖ తదుపరి చర్యలను సంబంధిత గ్రామసభకు తెలియజేయాలి.

2. గ్రామంలో మద్యం దుకాణాలు తెరవడానికి కావలసిన లైసెన్సులు మంజూరు చేయడానికి ముందుగా గ్రామసభను సంప్రదించాలి. గ్రామసభ నాలుగు వారాలలోపు తమ అభిప్రాయాన్ని తీర్మానం ద్వారా తెలియజేయాలి. లైసెన్సు కేవలం స్థానిక గిరిజనులకు మాత్రమే మంజూరు చేయాలి.

3. గ్రామంలో మద్యం దుకాణం/బార్‌ను ప్రారంభించడానికి కావలసిన లైసెన్సును మంజూరు చేస్తున్నట్లు లేదా నిరాకరిస్తున్నట్లుగా ఎక్సైజ్ శాఖ వ్రాత పూర్వక ఉత్వర్వుల ద్వారా గ్రామ సభకు తెలియచేయాలి. ఈ విషయంలో గ్రామసభ తీర్మానానికి కట్టుబడి ఉండాలి, అదే అంతిమమైనది.

4. గిరిజనుల వివాహాలు, ఇతర సామాజిక మతపరమైన వేడుకలో మరియు వారి సాంస్కృతిక గుర్తింపు కోసం, అమ్మడానికి వీలులేకుండా కేవలం స్థానికంగా మద్యాన్ని వినియోగించడానికి వారి వారి గ్రామంలో నివసించే షెడ్యూల్డు తెగల వారు బట్టీ/ఉత్పత్తి చేయడానికి సాంప్రదాయ మద్యం పరిమాణాన్ని గ్రామసభ నిర్ణయించాలి.

> గ్రామసభలు జరుగకుండానే జరిగినట్లు వేలిముద్రలు, సంతకాలు తీసుకొని మోసం చేస్తున్నారు. సమావేశాలలో చర్చిస్తున్న విషయాలు ఒకటికాగా తీర్మాన కాగితాలు మరొకటి తయారు చేస్తున్నారు. నిరక్షరాస్యత, అమాయకత్వానికి తోడు సారామత్తులో ఉన్న గిరిజనులను అనేక స్వార్ధపర శక్తులు దోపిడీ చేస్తున్నాయి. గిరిజన అభివృద్ధి కుంటుపడుతుంది. మధ్యపానం పూర్తిగా నిషేధించాలా గ్రామసభలు నిర్ణయించవచ్చు.

**(ఎఫ్) ఆచార సంప్రదాయాలు పరిరక్షించుకునే హక్కు, వివాదాలు పరిష్కరించుకునే హక్కు**

సంప్రదాయంగా వస్తున్న పంచాయితీలకు సంబంధించిన వ్యక్తిగత, ఆస్తుల వివాదాలను గ్రామసభ పరిష్కరించుకోవచ్చు. కుటుంబ, వివాహ, మనోవర్తి తగాదాలు, పంట నష్టం, భూమి పంపకాలు, భూమి ఆక్రమణలు వంటి తగాదాలు పరిష్కరించవచ్చు. ప్రభుత్వ చట్టాల విధానాలకు వ్యతిరేకం కానటువంటి తగాదాలు గ్రామసభ పరిష్కరించవచ్చు.



ఆదిమవాస ప్రాంతాలకు చొరబడిన మైదాన ప్రాంత సంస్కృతి, ఆదివాసుల ఐకమత్యానికి, భాష, సాంస్కృతిక, సామాజిక జీవన విధానానికి ప్రతిబంధకంగా తయారయింది. వంశపారంపర్యంగా వస్తూ విలువలు కలిగిన ఆదిమవాస సంస్కృతిని కనుమరుగు చేయడానికి 'మైదాన' సంస్కృతి దోహదపడుతుంది. ఆదిమవాసుల గుండెల్లో సంబరానికి సంకేతంగా నిలిచిన ఆట, పాట, సంప్రదాయక నృత్యాలు క్రమేపీ అదృశ్యమవుతున్నాయి. వాటి స్థానంలో అశ్లీల సినీ సాహిత్యం ఆక్రమిస్తోంది.



జొన్న, కంది, అపరాలు, మామిడి, చిక్కుడు, సామ మున్నగు పంటలు చేతికి రాగానే కొత్తలు(పండుగలు) జరుపుకొనే సంస్కృతి గిరిజనులకు ఉంది. ప్రకృతిని ఆరాధించే ఆచార సంప్రదాయం ఆదిమవాసుల్లో ఉంది. భూదేవి, గంగానమ్మ వంటి గ్రామ దేవతలను కొలుస్తూ ప్రధాన పంటలు రాగానే సంబరంతో నైవేధ్యం సమర్పించే ఉన్నత విలువలు గల సంస్కృతి వారిలో ఉంది. వారి ఆచారం సహజ వనరుల పట్ల గల ప్రేమకు సంకేతం.

హిందూ జీవన విధానం, వారి వివాహ పద్దతుల ప్రభావం ఆదిమవాసుల జీవన విధానంపై పడడంతో ఎంతో వ్యయభారం, సమస్యలు

మోయవలసి వస్తోంది. వైవాహిక సంబంధ సమస్యలు లేని ఆదిమవాస ప్రాంతాల్లో సామాజిక దురాచారాన్ని చాటే మైదాన ప్రాంత 'వరకట్న' సంస్కృతి ప్రబలి ఆదిమవాసులను సామాజిక అనైక్యత, ఆర్థిక దుస్థితికి గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామసభ అధికారాలు వినియోగించుకొని గిరిజన సంస్కృతిని పరిరక్షించుకోవాలి.

**(జి) మహిళా, శిశు సంక్షేమం:**

గ్రామసభ అంగన్‌వాడి కేంద్రాల బడ్జెట్‌ను ఆమోదించే అధికారం ఉంది. అందుకుగాను సంబంధిత శాఖ అంగన్‌వాడీ కేంద్రాల బడ్జెట్ ప్రతిపాదనను గ్రామసభ ముందు చర్చించడానికి, నిర్ణయం తీసుకోవడానికి ఉంచాలి.



# మోడల్ నమూనాలు

## 1. గ్రామసభ-తీర్మానాలు

గ్రామం పేరు :
తేదీ :
గ్రామసభ జరిగిన ప్రదేశం/సమయం:
హాజరైన సభ్యుల సంఖ్య :
ఎజెండా అంశాలు : 1.
2.
3.

చర్చించిన అనంతరం ప్రతిపాదనలు:

(1) ప్రతిపాదన :
ఆమోదం : అంగీకరించే వారి సంఖ్య ( )
వ్యతిరేకించే వారిసంఖ్య ( )
తీర్మానం :

(2) ప్రతిపాదన :
ఆమోదం : అంగీకరించే వారి సంఖ్య ( )
వ్యతిరేకించే వారిసంఖ్య ( )
తీర్మానం :

(3) ప్రతిపాదన :
ఆమోదం : అంగీకరించే వారి సంఖ్య ( )
వ్యతిరేకించే వారిసంఖ్య ( )
తీర్మానం :

(సం.)
కార్యదర్శి
(గ్రామసభ)

(సం.)
వైస్ ప్రెసిడెంట్
(గ్రామసభ)

గ్రామసభ సభ్యుల సంతకాలు:

## 2. నిధుల ధృవీకరణ పత్రం:

గ్రామసభ తీర్మానంసంఖ్య :

తేదీ :

గ్రామ పంచాయితీ పేరు :

గ్రామం పేరు :

పనుల వివరాలు :

మంజూరుకాబడిన బడ్జెట్ వివరాలు :

**ఖర్చుల వివరాలు :**

కూలీలకు :

మెటీరియల్‌కు :

**రవణా మరియు ఇతర ఖర్చులు :**

పని పేరు :

పూర్తయిన పని వివరం :

పూర్తికావలసిన పని వివరం :

కార్యదర్శి
(గ్రామసభ)
తేదీ:

వైస్ ప్రెసిడెంట్
(గ్రామసభ)



3 గ్రామసభ ఉమ్మడి ఆస్తుల నిర్వహణ రిజిష్టరు

| వరుస సంఖ్య | ఉమ్మడి ఆస్థి పేరు | వివరాలు | ప్రస్తుత వినియోగం | వినియోగంలో మార్పులు | తీర్మానాల వివరాలు | రిమార్కులు |
|---|---|---|---|---|---|---|
| | | | | | | |

ఉమ్మడి ఆస్థులు:

1. చెరువులు, 2. కాలువలు, 3. చెక్‌డాం / రిజర్వాయర్లు 4. వాటర్ షెడ్ నిర్మాణం, 5. రక్షిత మంచినీటి పధకం, 6. రహదార్లు, 7. కమ్యూనిటీ భవనం, 8. పాఠశాల భవనం, 9. ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్లు, 10. చౌక సరఫరా డిపోలు, 11.అంగన్‌వాడీ కేంద్రాలు, 12.మహిళా మండలి భవనం, 13. లైబ్రరీ, 14. మార్కెట్ స్థలాలు, 15. మురుగు కాల్వలు, 16. ఇతర ప్రభుత్వ నిర్మాణాలు, 17. ఉమ్మడి భూములు, 18. వృక్షాలు, 19. పోరంబోకు భూములు, 20. పుంతలు, 21. తోపులు, 22. రచ్చబండ స్థలాలు, 23. పంటనూర్పు స్థలాలు, 24. ఇతర సాంప్రదాయక స్థలాలు.

## 4. ప్రభుత్వ పథకాలు - లబ్ధిదారు రిజిస్టర్

| వరుస సంఖ్య | ప్రభుత్వం/పథకం పేరు | లబ్ధిదారుని పేరు | ఇప్పటివరకూ ఏ టువంటి లబ్ధిచేకూరింది | భూమిలేని పేదలు | ఒంటరి మహిళలు | నిరాధరణకు గురైనవారు | వికలాంగులు | రిమార్కులు |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | |

## 5. గ్రామసభ నగదు పుస్తకం

బ్యాంకు పేరు:
పోస్టాఫీసు:
గ్రామపెద్ద పేరు:

| వరుస సంఖ్య | తేది | సొమ్ము చెల్లింపు మొత్తం | చెల్లించిన వారి పేరు | ఎందు నిమిత్తం | జమచేసిన తేదీ | నెలాఖరుకు జమఅయిన మొత్తం | ఇతర వివరాలు |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | |





## 6. గిరిజన భూమి అన్యాక్రాంతంపై ఫిర్యాదు

గ్రామసభ తీర్మానం సంఖ్య :
తేదీ :
ఫిర్యాదు దారుని పేరు :
గిరిజనేతరుని పేరు :
ఆక్రమణ భూమి వివరం :
సర్వే నెంబరు :
విస్తీర్ణం :
గిరిజనుని భూమి బదలాయింపు :
జరిగిన తీరు : అమ్మకం/కౌలు/తనఖా/దానం/ఆక్రమణ/బినామీ/ఇతరత్రా బదలాయింపులు
ఉల్లంఘించిన నియమాలు : భూ బదలాయింపు క్రమబద్ధీకరణ నిబంధనలు(1 ఆఫ్ 1970)
తీర్మానం :

కార్యదర్శి (గ్రామసభ)
వైస్ ప్రెసిడెంట్ (గ్రామసభ)
తేదీ:

**ఉదాహరణ - తీర్మానం:** గిరిజన, గిరిజనేతర్ల భూమి వివరాలు, సాగువివరాలు, సంబంధించిన పత్రాలు పరిశీలించిన తర్వాత భూ బదలాయింపు క్రమబద్ధీకరణ నిబంధనలు(1 ఆఫ్ 1970)అతిక్రమించి గిరిజనేతరుడు సాగు చేసుకుంటునట్లుగా గ్రామసభ విచారణలో తేలింది. అందువల్ల భూ బదలాయింపు క్రమబద్ధీకరణ నిబంధనలు(1 ఆఫ్ 1970)కింద పేర్కొనబడిన విచారణాధికారికి తదుపరి విచారణ నిమిత్తం పంపించడానికి తీర్మానించబడినది.

### 7. గిరిజన భూమి సాగు వివరాలు నమోదుకు విజ్ఞప్తి

గ్రామసభ తీర్మానం సంఖ్య :
తేదీ :
ఫిర్యాదు దారుని పేరు :
గిరిజనేతరుని పేరు :
భూమి వివరం :
సర్వే నెంబరు :
విస్తీర్ణం :
భూమి వాస్తవ సాగు స్వభావం/ స్వాధీనం : గిరిజన, గిరిజనేతర వివాదస్పద భూమి ప్రస్తుతం గిరిజనుల సాగులో ఉన్నది.
తీర్మానం :

కార్యదర్శి (గ్రామసభ) — వైస్ ప్రెసిడెంట్ (గ్రామసభ)
తేదీ:

**ఉదాహరణ - తీర్మానం:** వివాదస్పద భూమి సాగు విషయంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి విచారణ చేయగా గిరిజన సాగులోనే గత రెండు సంవత్సరాలనుండి ఉంటూ గిరిజనుడు అనుభవిస్తున్నట్లుగా తేలినది. అందువల్ల రెవెన్యూ లెక్కలలో గిరిజనుడి పేరును సాగుదారుని కాలంలో నమోదు చేయవలసినదిగా కోరడమైనది. ఈ విజ్ఞప్తిని తహసిల్దార్, గ్రామ రెవిన్యూ అధికారికి రెవెన్యూ లెక్కల్లో మార్పుల కోసం గ్రామసభ తీర్మానించడమైనది.





### 8. చిన్న తరహా అటవీ ఉత్పత్తుల రవాణా పర్మిట్

తీర్మానం సంఖ్య :
తేదీ :

1. సేకరణదార్లు/అమ్మకందార్ల పేర్లు :
2. చిన్నతరహా అటవీ ఉత్పత్తుల వివరాలు :
3. చిన్నతరహా అటవీ ఉత్పత్తుల పరిమాణం :
4. రవాణా చేస్తున్న మార్కెట్ స్థలం/ఊరు :
5. రవాణా రూట్ వివరాలు :
6. రవాణా ఎలా చేస్తున్నది (సైకిల్, మనిషి మోత, ఇతర వాహనాలు, వాటి వివరాలు :
7. పర్మిట్ రుసుం/చెల్లింపు వివరాలు :

(సం.)
రవాణా దారులు

(సం.) కార్యదర్శి (గ్రామసభ) — (సం.) వైస్ ప్రెసిడెంట్ (గ్రామసభ)
తేదీ:

## II అటవీ హక్కుల గుర్తింపు చట్టం-గ్రామసభ అధికారాలు

**1. గ్రామసభ అంటే ఏమిటి?**

షెడ్యూల్డు ప్రాంతాల్లో అమలులో ఉన్న పెసాచట్టం కింద పేర్కొనబడిన గ్రామసభనే అటవీ హక్కుల గుర్తింపు చట్టం కింద కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

**2. అటవీ హక్కుల కమిటీని గ్రామసభ ఎలా ఏర్పరుస్తుంది?**

గ్రామసభ సభ్యులనుంచి అటవీ హక్కుల కమిటీ సభ్యులను గ్రామసభ ఎంపిక చేస్తుంది. 'అటవీ హక్కుల కమిటీ' కనీసం 10 మంది నుంచి గరిష్ఠంగా 15 వరకు సభ్యులు ఉండవచ్చు. కమిటీ సభ్యులతో 1/3 వంతు గిరిజనులు ఉండాలి. ఆసభ్యులలో 1/3 వంతు గిరిజన మహిళలకు అవకాశం కల్పించాలి. ఎస్.టిలు లేని పక్షంలో కనీసం 1/3 వంతు మహిళలకు అవకాశం కల్పించాలి. అటవీ హక్కుల కమిటీకి ఒక అధ్యక్షులు, మరియు సెక్రటరీ ఉండాలి. అటవీ హక్కుల కమిటీసభ్యుల అటవీ హక్కు గుర్తింపు ప్రక్రియజరుగుతున్నపుడు ఆ కమిటీ సభ్యులు పాల్గొనరాదు.

**3. అటవీ హక్కుల గుర్తింపులో గ్రామసభ విధులు ఏమటి?**

ఎ) అటవీ హక్కుల స్వభావం, విస్తీర్ణ నిర్ధారణ ప్రక్రియలో క్లయిమ్(అర్జీ)లు స్వీకరణ, విచారణ చేయడం.

బి) హక్కుల కోరే వారి జాబితా తయారు చేసి రిజిస్టర్ నిర్వహించడం.

సి) అటవీ హక్కుల కోరే వ్యక్తులకు, సంబంధిత అధికార్లకు తగిన అవకాశం ఇచ్చి అటవీ హక్కుల గుర్తింపు క్లయిమ్స్ తీర్మానం ఆమోదించి సబ్‌డివిజనల్ కమిటీకి పంపడం.

డి) నిర్వాసితుల పునరావాసం ప్యాకేజీను పరిశీలించి తగు తీర్మానాలు ఆమోదించడం

ఇ) వన్యప్రాణి, అడవులు, మరియు జీవవైవిధ్యం కాపాడటానికి తగు పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయడం. మౌలిక సదుపాయాలు చేపట్టే అధికారం.



**4. గ్రామసభ నిర్వహణకు కోరం ఎంత ఉండాలి?**

గ్రామసభ సమావేశానికి 2/3 వంతు సభ్యులు హాజరు తక్కువకాకుండా ఉండాలి.

**5. అటవీ హక్కుల నిర్ధారణలో గ్రామసభ అనుసరించాల్సిన పద్ధతి ఏమిటి?**

ఎ) అటవీ హక్కుల కోరే వ్యక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి అటవీ హక్కుల కమిటీకి అధికారం ఇస్తుంది.

బి) గ్రామసభ క్లయిమ్స్ ఆహ్వానించిన తేదీనుంచి మూడు నెలలులోగా ధరఖాస్తుదార్లు దారఖాస్తులను నమోదు చేయించుకోవడం.

సి) గ్రామసభ అవసరమయ్యిన పక్షంలో తగు కారణాలు చూపి దరఖాస్తు నమోదు కాలాన్ని పొడిగించవచ్చు.

డి) ప్రజల ఉమ్మడి అటవీ వనరులు ఇతర గ్రామసభల పరిధిలో కలిసి ఉన్నట్లయితే అటవీ వనరులపై హక్కుల నిర్ధారణకు ఒక తేదీ నిర్ణయించి సంబంధిత గ్రామసభలకు, మరియు సబ్ డివిజినల్ కమిటీకి తెలియజేయవచ్చు.

**6. అటవీ హక్కుల నిర్దారణలో గ్రామసభ నిర్ణయాన్ని విభేదించే వారు అర్జీ ఎక్కడ దాఖలు చేసుకోవాలి? ఎన్ని రోజులలో దాఖలుచేయవచ్చు?**

గ్రామసభ తీర్మానం వెలువడిన నాటి నుంచి 60 రోజులలోగా సబ్ డివిజినల్ కమిటీకి అర్జీ చేసుకోవచ్చు.

**7. సబ్ డివిజనల్ కమిటీ ఎలా విచారణ చేస్తుంది?**

అర్జీల విచారణకు 15 రోజుల ముందుగా స్థలాన్ని, ఒక తేదీని నిర్ణయించి సంబందిత, దరఖాస్తుదార్ల, గ్రామసభకు వ్రాతపూర్వకంగా తెలియజేయడంతోపాటు అర్జీదార్ల గ్రామాలలో బహిరంగ ప్రదేశాలలో 'నోటీసు' ఉంచడం ద్వారా సమాచారం తెలియచేస్తుంది.

### 8. అటవీ ప్రాంతాలలో గ్రామసభల అనుమతితో మౌలిక సదుపాయాలు చేపట్టే వీలుందా?

అటవీ సంరక్షణ చట్టం 1980 కింద అటవీ భూములను అటవేతర ప్రయోజనాలకు వినియోగించరాదు. ఈ నియామాలను అధిగమిస్తూ మౌలికసదుపాయాల కల్పనకు ఒక హెక్టారు అటవీ భూమిలో, 75 చెట్లకుమించి తొలగించకుండా అభివృద్ధి పనులు చేపట్టేందుకు అటవీ హక్కుల గుర్తింపు చట్టం అనుమతిస్తుంది. ఇటువంటి ప్రాజెక్టులు ప్రభుత్వం చేపట్టాలంటే ముందుగా గ్రామసభ సిఫార్సులు తప్పనిసరి.

### 9. సబ్ డివిజనల్ కమిటీ విచారణ అనంతరం తీర్పు ఎలా ఇవ్వవచ్చు?

దరఖాస్తుదార్ల అర్జీనే ఆమోదించవచ్చు, లేదా తిరస్కరించవచ్చు లేదా పునఃపరిశీలనకు సంబంధిత గ్రామసభకు పంపించవచ్చు. గ్రామసభకు పునఃపరిశీలనకు పంపితే సూచనలు అందిన 30 రోజులలోగా గ్రామసభ సమావేశం ఏర్పాటు చేసి దరఖాస్తుదార్ల విన్నపాన్ని పరిశీలించి, తీర్మానం చేసి సబ్‌డివిజనల్ కమిటీకి తిరిగి పంపించవచ్చు. తర్వాత అలా పంపిన తీర్మానాన్ని సబ్ డివిజనల్ కమిటీ ఆమోదించవచ్చు, లేక తిరస్కరిస్తూ సముచిత ఉత్తర్వులు ఇవ్వవచ్చు.

### 10. గ్రామసభల మధ్య నెలకొన్న వివాద పరిష్కారంలో సబ్ డివిజనల్ కమిటీ పాత్ర ఏమిటి?

గ్రామసభల మధ్య వివాదాలు ఉన్నట్లయితే సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేసి వివాదాలు పరిష్కరించవచ్చు. గ్రామస్థులు స్వచ్ఛందంగా ఒకే అంగీకారానికి రాలేకపోతే 30 రోజులలోగా గ్రామసభల వాదనలు విని ఉత్తర్వులు జారీ చేయవచ్చు.

### 11. సబ్ డివిజనల్ కమిటీ నిర్ణయం విభేదించే వారు ఎక్కడ అర్జీలు దాఖలు చేయాలి?

జిల్లాస్థాయి కమిటీకి అర్జీలు చేయాలి. సబ్ డివిజనల్ కమిటీ తీర్పు విబేధించే వారు తీర్పు వెలువడిన 60 రోజులలోగా జిల్లా స్థాయి కమిటీకి అర్జీలు చేసుకోవాలి.



## III జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం-గ్రామసభ అధికారాలు

గ్రామ పంచాయితీ పరిధిలో చేపట్టే ప్రాజెక్టుల విషయంలో గ్రామసభ సిఫార్సులు కీలకం. ఉపాధిహామీ పథకం పనులు చేపట్టే విషయంలో గ్రామసభ చర్చించి, తీర్మానాలు పంచాయితీకి పంపించవచ్చు. ఉపాధి హామీ పనులు అమలు, పర్యవేక్షణ అధికారం గ్రామసభలకు ఉంటుంది. పనుల నాణ్యత, నిర్ణయించిన పనులు నిర్వహణ పర్యవేక్షించవచ్చు. ఉపాది హామీ పనులు పర్యవేక్షణకు 'నిఘా', పర్యవేక్షణ సంఘ సభ్యులను ఎంపికచేసి సంఘాన్ని గ్రామసభ ఏర్పాటు చేయవచ్చు.

గ్రామపరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల అమలుపై సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నిర్వహించే అధికారం గ్రామసభకు ఉంటుంది. సామాజిక తనిఖీ నిమిత్తం శ్రామికుల హాజరు పట్టి, బిల్లులు, ఓచర్లు, కొలతల పుస్తకాలు, పని మంజూరు ఉత్తర్వులు, మరియు వర్క్ ఆర్డర్లుకు సంబంధించిన అక్కౌంటు పుస్తకాలు, వేతన చెల్లింపు వివరాలు, పనుల నాణ్యత, పనులు పూర్తయినట్లు చెప్పే నివేదికలు ఇతరత్రా వివరాలు గ్రామ పంచాయితీ ముందుగా గ్రామసభకు అందజేయాలి. వివరాలను పరిశీలించి చర్చించిన తర్వాత సామాజిక తనిఖీలో వెల్లడైన వాస్తవాలు గ్రామసభ ప్రకటించవచ్చు.



## IV అనుబంధాలు

### 1. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత పంచాయితీరాజ్ విస్తరణ నియమాలు - 2011 (జి.ఒ.నెంబరు 66 - తేదీ 24-3-2011)

ఈ నియమాలు రాష్ట్ర షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తిస్తాయి.

### నిర్వచనాలు

**(1) ఈ నియమావళిలో, సందర్భం ఇతర విధంగా అవసరమయినప్పుడు మినహా**

(i) 'చట్టము' అనగా 1998 (1998లో 7వ (పెసా) చట్టం) పంచాయతీరాజ్ చట్టం ద్వారా సవరించిన 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం.

(ii) 'గ్రామసభ' అంటే ఈ క్రింది నియమం (4) ద్వారా అమలులోకి వచ్చే గ్రామసభ.

(iii) 'చిన్నతరహా నీటి వనరులు' అంటే త్రాగునీటికి ఉపయోగించే సహజనీటి నిల్వలు, 40 హెక్టార్లవరకు సాగుకోసం ఉపయోగించిన చెక్ డ్యాములు నిర్మాణం ద్వారా నిల్వచేసే నీటి వనరులు అని అర్థం,

(iv) షెడ్యూల్డు ప్రాంతాలు అంటే భారత రాజ్యాంగం 5వ షెడ్యూలులో 6వ పేరా క్రింద ప్రకటించబడిన ప్రాంతాలు.

(v) ఈ నియమాలలో పేర్కొన్న "కమీషనరు" అంటే గిరిజన సంక్షేమ శాఖ కమీషనరుగా భావించాలి.

**(2)** ఈ నియమాలలో ఉపయోగించి, నిర్వచించని పదాలకు ఆయా సంబంధిత గనులు, ఖనిజాల (క్రమబద్ధీకరణ అభివృద్ధి) చట్టము, 1957. ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు ప్రాంత భూ బదలాయింపు క్రమబద్ధీకరణ నిబంధనలు 1959; ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత వడ్డీ వ్యాపార నిబంధనలు, 1960; ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత రుణ విమోచన రెగ్యులేషన్, 19960; ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ ఉత్పత్తుల మరియు పశుగణ) చట్టం, 1966; ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం, 1967; ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం, 1968; ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత గిరిజనులు రుణ విమోచన రెగ్యులేషన్, 1970; ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత చిన్న తరహా అటవీ ఉత్పత్తుల వర్తకం (వాణిజ్య క్రమబద్ధీకరణ) నిబంధనలు, 1979; అటవీ సంరక్షణ చట్టం 1980; ఆంధ్రప్రదేశ్ విద్యాచట్టం, 1982; ఆంధ్రప్రదేశ్ రైతుల సాగునీటి వ్యవస్థల నిర్వహణ చట్టం, 1997; ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ (సవరణ) చట్టం, 1998; షెడ్యూల్డు తెగల మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసితుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం 2006 లేదా అమలులో ఉన్న ఏదేని ఇతర చట్టాలలో నిర్వచించిన అర్థాలే కలిగి ఉంటాయి.

**(3) షెడ్యూల్డు ప్రాంతాలలో గ్రామాలను ప్రకటించడం:**

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ షెడ్యూల్డు ప్రాంతాల (పెసా) చట్టం, 1998 ద్వారా సవరించబడిన పంచాయితీరాజ్ చట్టంలోని 3వ విభాగం నిమిత్తం.

(i) శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఖమ్మం, వరంగల్, అదిలాబాద్ మరియు మహబూబ్‌నగర్ జిల్లాల షెడ్యూల్డు ప్రాంతాలలో గ్రామాల జాబితాను రూపొందించవలసిందిగా సంబంధిత జిల్లాల కలెక్టర్లను కమీషనరు కోరవచ్చు.

(ii) ఆచార, సంప్రదాయాల ప్రకారం వారి వ్యవహారాలు నిర్వహించుకుంటూ నివశిస్తున్న ప్రజల ఆవాసం లేదా ఆవాసాల సముదాయం లేదా శివారు గ్రామం లేదా శివారు గ్రామాల సముదాయాలను "గ్రామం"గా పరిగణించవచ్చు.

(iii) అటువంటి అభ్యర్థన అందిన తర్వాత, జిల్లా కలెక్టరు, ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారితో సంప్రదించి, జనావాసం/శివారు గ్రామం లేదా వాటి గ్రూపులతో ఉన్న గ్రామాలతోకూడిన ఒక ప్రతిపాదనను రూపొందించవచ్చు.

(iv) ఆ విధంగా రూపొందించిన ప్రతిపాదన లేదా ప్రతిపాదనలను కమీషనరుకు సమర్పించాలి. అటువంటి ప్రతిపాదనలను కమీషనరు సమీక్షించిన తర్వాత, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం,

తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఖమ్మం, వరంగల్, అదిలాబాద్ మరియు మహబూబ్‌నగర్ జిల్లాల షెడ్యూల్డు ప్రాంతాలలో గ్రామాలను ప్రకటిస్తారు.

**(4) గ్రామసభ, దాని విధులు:**

(i) గ్రామస్థాయిలో ఓటర్ల జాబితాలో పేర్కొనబడిన వ్యక్తులతో కూడిన 'గ్రామసభ' ఆవిధంగా ప్రకటించబడిన ప్రతీగ్రామానికీ ఉంటుంది.

(ii) గ్రామ పంచాయతీ సర్పంచి గ్రామసభకు అధ్యక్షులుగా ఉంటారు. ఈ క్రింద పేర్కొన్న పద్ధతి ప్రకారం ఉపాధ్యక్షుడిని, కార్యదర్శిని గ్రామసభ ఎన్నుకోవాలి.

(iii) ఐ.టి.డి.ఏ, ప్రాజెక్టు అధికారి మొదటి గ్రామసభను నిర్వమించడానికి డిప్యూటీ తహసిల్దారు హోదాకు తక్కువ కానటువంటి అధికారిని ఈ నియమాలు కింద నియమించాలి. గ్రామసభ సమావేశానికి సంబంధిత గ్రామ పంచాయితీ సర్పంచ్ అధ్యక్షత వహించాలి. సర్పంచ్ లేనప్పుడు సాంప్రదాయ గ్రామ పెద్ద/స్వయం సహాయక గ్రూపు గ్రామసభ సమావేశానికి అధ్యక్షత వహించవచ్చు.

iv) గ్రామసభ సభ్యులలో 1/3వ వంతు కంటే తక్కువగాకాకుండా అందులో కనీసం 50 శాతం మంది ఎస్.టి. సభ్యులు హాజరును గ్రామసభ సమావేశానికి "కోరం"గా పరిగణిస్తారు.

(v) మెజార్టీ గ్రామ సభ్యులు చేతులు ఎత్తడం ద్వారా గ్రామసభ ఉపాధ్యక్షుడిని, కార్యదర్శిని ఎన్నుకోవాలి. ఉపాధ్యక్షుడు, కార్యదర్శిలు షెడ్యూల్డు తెగకు చెందిన వారై ఉండాలి. వారి పదవీకాలం 5 సంవత్సరాలు.

(vi) శాసనపర బాధ్యతగా ఏడాదిలో కనీసం రెండుసార్లు చట్టపర గ్రామసభ సమావేశాలు నిర్వహించాలి. అయితే వీటికి అదనంగా నిర్ణయించిన ప్రదేశం, సమయంలో అవసరమైనప్పుడు గ్రామసభ సమావేశాలు ఎన్నైనా ఏర్పర్చుకోవచ్చు.

(vii) సమావేశపు హాజరు పట్టీలో సమావేశానికి అధ్యక్షత వహించే సభ్యులు గ్రామసభకు హాజరైన సభ్యులందరి నుంచి సంతకాలను లేదా వేలిముద్రలను తీసుకోవాలి.



(viii) గ్రామసభ సమావేశం అనతంరం గ్రామసభ నిర్ణయాలను నిర్వహణ అధికారి చదివి వినిపించి, సభ్యుల ఆమోదం పొందాలి. ప్రతీ తీర్మానపు అంశాన్ని ప్రత్యేకంగా వ్రాసి ఆమోదించడం లేదా ఇతరత్రా వాటితో గ్రామసభ ఆమోదం పొందాలి. సభ్యులు తమ ఆమోదాన్ని చేతులు ఎత్తడం ద్వారా తెలియజేయాలి.

(ix) సమావేశాలలో ఆమోదించిన గ్రామసభ తీర్మానాలను ఒక రిజిస్టరులో నమోదు చేసుకోవాలి. గ్రామసభ కార్యదర్శి/ఉపాధ్యక్షుడు సందర్భాన్ని బట్టి సభ్యుల సంతకం/వేలిముద్రలను తీసుకోవాలి.

(x) ఈ తర్మానాలను నాలుగు వారాలలోపు గ్రామసభ కార్యదర్శి సంబంధిత ప్రభుత్వ శాఖలకు/సంస్థలకు పంపాలి.

(xi) ఎ) ఈ క్రింది అంశాలపై నిర్ణయాలకోసం గ్రామసభ ముందుంచాలి. గ్రామ వ్యవసాయ ఉత్పాదక ప్రణాళికలు.

(బి) గ్రామాలలో ఉన్న ఊరు ఉమ్మడి భూములు జాబితా, అంటే పంచాయితీకి చెందిన పోరంబోకు భూములు మరియు ఇతర సంబంధిత వివరాలు.

(సి) ఇంటి, ఇతర స్థిరాస్థుల యాజమాన్యాల బదలాయింపులు.

(డి) గ్రామ పంచాయతీ ఆమోదించిన బడ్జెట్ అంచనాల ప్రతి.

(ఇ) పంచాయతీ లెక్కల ఆడిట్ నివేదిక ప్రతి.

(ఎఫ్) గ్రామ పంచాయతీకి రావలసిన పన్నులు, రుసుముల బకాయిలు ఉన్న బకాయిదారుల జాబితా.

(జి) చౌక ధర దుకాణం/ డి.ఆర్.డిపో పనితీరు.

(హెచ్) అంగన్‌వాడీ పనితీరు.

(ఐ) సబ్ సెంటర్స్ పనితీరు,

(జె) పాఠశాలల పనితీరు.

(కె) సంక్షేమ హాస్టళ్ళ పనితీరు.

(ఎల్) త్రాగునీటి సౌకర్యం.

(ఎమ్) విద్యుత్ సౌకర్యం మరియు

(ఎన్) ఇతర అభివృద్ధి కార్యక్రమాలు.

(xii) ప్రతి కుటుంబ సామాజిక, ఆర్థిక పరిస్థితులను తెలియపరిచే వివరాలు రూపొందించి వాటిని గ్రామసభ ఆమోదించాలి. మానవ, సహజ సిద్ధమైన వనరులతోపాటు అక్షరాస్యతా స్థాయి, భూమి లేని కుటుంబాల మరియు మహిళా యజమాన్య కుటుంబాల, ఇంతవరకు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి వాటి ప్రస్తుత పరిస్థితి, గ్రామ సమస్యలు వాటి ప్రాధాన్యతలు మున్నగు వివరాలను ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణ మదింపు పద్దతి ద్వారా రూపొందించాలి.

(xiii) జనావాస ప్రాంతాలలో వ్యక్తిగత/సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి వాటిని అమలు చేయడంలో గ్రామసభను భాగస్థులుగా చేయాలి.

(xiv) గ్రామ అభివృద్ధి ప్రణాళికలు, మరియు పథకాల లబిక్ధ, ప్రాధాన్యతలను రూపొందించడంలో సంబంధిత ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి నియమించిన భహుళ క్రమశిక్షణా బృందాలు, లేదా ఇతర ప్రభుత్వ ఏజన్సీల సలహాలను/సహాయాన్ని మండల ప్రజా పరిషత్తు కోరవచ్చు.

(xv) గ్రామసభకు విడుదల చేసిన నిధులు విషయంలో సంబంధిత సంస్థ/ప్రభుత్వ శాఖకు నిధుల వినియోగ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలి.

**5. షెడ్యూల్డు ప్రాంతాలలో భూసేకరణ:**

(1) ఏదైనా చట్టం క్రింద ప్రభుత్వం లేదా సంబంధిత అధికారి భూసేకరణ ప్రతిపాదించినట్లయితే, ఆ ప్రతిపాదనలతో పాటు ఈ క్రింది సమాచారాన్ని మండల ప్రజా పరిషత్తుకు సమర్పించాలి.

(i) ప్రతిపాదిత ప్రాజెక్టు పూర్తి వివరాలతో పాటు అది కలుగచేసే ప్రభావం.

(ii) ప్రతిపాదిత భూసేకరణ.



(iii) గ్రామంలో కొత్తగా స్థిరపడే ప్రజలు, ఆ ప్రాంతం మరియు సమాజంపైచూపే ప్రభావం.

(iv) గ్రామ ప్రజలకు చెల్లించే వారి నష్టపరిహార మొత్తం, ఉద్యోగ అవకాశాలు.

(2) పూర్తి సమాచారం అందిన తర్వాత సంబంధిత అధికారుల ప్రతినిధులను మరియు ప్రభుత్వాన్ని వ్యక్తిగతంగా లేదా సమిష్టిగా ప్రతిపాదనలను పరిశీలించడం కోసం హాజరువావాలని కోరే అధికారం సంబంధిత మండల ప్రజా పరిషత్తు కలిగి ఉంటుంది. అవిధంగా పిలవబడిన వ్యక్తులు అంశాలవారీగా స్పష్టమైన, ఖచ్చితమైన సమాచారాన్ని అందజేయాల్సి ఉంటుంది.

(3) అన్ని వాస్తవాలను పరిశీలించిన తర్వాత ప్రతిపాదిత భూసేకరణ, నిర్వాసిత వ్యక్తుల పునరావాస ప్రణాళిక విషయం మండల ప్రజా పరిషత్తు సిఫార్సు చేయాలి.

(4) అట్టి మండల ప్రజాపరిషత్తు సిఫార్సులను భూసేకరణాధికారి పరిగణలోకి తీసుకోవాలి.

(5) మండల ప్రజాపరిషత్తు సిఫార్సులతో అంగీకరించని పక్షంలో మరోసారి పరిశీలనకోసం తిరిగి మండల ప్రజాపరిషత్తుకు భూసేకరణ అధికారి పంపుతారు.

(6) రెండవసారి సంప్రదింపులు తర్వాత కూడా మండల ప్రజా పరిషత్తు సిఫార్సులకు వ్యతిరేకంగా ఉత్తర్వును భూసేకరణ అధికారి చేసినట్లయితే, అందుకు గల కారణాలను వ్రాతపూర్వకంగా తెలియజేయాలి.

(7) పారిశ్రామిక ప్రాజెక్టులను నెలకొల్పే సందర్భంలో ఆ ప్రాజెక్టులవల్ల ప్రభావితమయ్యే అన్ని మండల ప్రజాపరిషత్తులను సంప్రదించాలి.

(8) భూసేకరణ ప్రకటన వెలువడిన తేదీ నుండి ప్రతి మూడు నెలలకు పునరావాస ప్రణాళిక ప్రగతిని మండల ప్రజాపరిషత్తుముందుంచాలి.

(9) సూచించిన చర్యలను తీసుకోవడంలేదని మండల ప్రజాపరిషత్తు భావించినట్లయితే వ్రాతపూర్వకంగా ఆ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి

తెలియపరచవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా ఆవిషయంపై సముచిత చర్య తీసుకోవాల్సి ఉంటుంది.

(10) ఆర్.ఆర్. ప్యాకేజీలో ఈ క్రింద తెలియజేసిన అంశాలు తప్పనిసరిగా ఉండాలి.

(ఎ) ప్రాజెక్టు బాధిత ప్రతి ఎస్.టి. కేటగిరీ కుటుంబానికి, ఆయకట్టులో భూ కేటాయింపు విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలి.

(బి) సాంప్రదాయ హక్కులు/అటవీ ఉత్పత్తుల వినియోగం వంటి నష్టాలకుగానూ 500 రోజుల వ్యవసాయ కనీస వేతనాలకు సమానమైన అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రాజెక్టు బాధిత ప్రతి గిరిజన కుటుంబానికి అందించాలి.

(సి) ప్రాజెక్టు బాధిత గిరిజన కుటుంబాలు కోరుకుంటున్న విధంగా వారి సహజ నివాస ప్రాంతానికి దగ్గరలో వీలున్నంతవరకూ, ఒక సంఘటిత బ్లాకులో వారికి పునరావాసం కల్పించాలి. దీనివల్ల వారి జాతి, భాష, సాంస్కృతిక ఉనికి కొనసాగించుకోగలరు.

(డి) నది/కుంట/డ్యామ్‌లో చేపలు పట్టే హక్కుగల ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు రిజర్వాయరు ప్రాంతంలో చేపలు పట్టే హక్కును కల్పించాలి.

(ఇ) ప్రాజెక్టు బాధిత గిరిజన కుటుంబాలకు, పునస్థీకరణ, పునరావాసం షెడ్యూల్డు ప్రాంతాలలోనే కల్పించాలి.

**(6) షెడ్యూల్డు ప్రాంతాలలో చిన్న తరహా నీటి వనరుల నిర్వహణ:**

(i) గ్రామ పరిధిలో ఉన్న చిన్న తరహా నీటి వనరులను ఆ గ్రామ జనాభా సమిష్ట ప్రయోజనాలకోసం ప్రణాళిక మరియు నిర్వహణా భాధ్యత గ్రామసభపై ఉంటుంది.

(ii) చిన్న తరహా నీటి వనరులు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ గ్రామాల ప్రజల ప్రయోజనాలకు సంబంధించినవి అయితే ఆయా గ్రామాల ప్రజల సమీష్ట ప్రయోజనం కోసం చిన్నతరహా నీటి వనరుల ప్రణాళిక మరియు నిర్వహణ బాధ్యత సంబంధిత గ్రామ పంచాయతీపై ఉంటుంది.



(iii) సంబంధిత గ్రామ పంచాయతీ ప్రజల సమిష్ట ప్రయోజనం కోసం చిన్నతరహా నీటి వనరుల ప్రణాళిక మరియు నిర్వహణ బాధ్యత ఆయా మండల ప్రజా పరిషత్తుపై ఉంటుంది.

(iv) రెండు లేదా అంతకంటే ఎక్కువ మండలాల పరిధిలో చిన్నతరహా నీటివనరులు ఉన్నట్లయితే ఆయా మండలాల్లో నివసించే ప్రజల సమిష్ట ప్రయోజనం కోసం చిన్నతరహా నీటి వనరుల ప్రణాళికా మరియు నిర్వహణ బాధ్యత సంబంధిత జిల్లా పరిషత్తుపై ఉంటుంది.

(v) చిన్నతరహా నీటి వనరులు రెండు లేదా అంతకంటే ఎక్కువ జిల్లా పరిషత్‌ల పరిధిలో ఉన్నట్లయితే ఆయా ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల సమిష్ట ప్రయోజనం కోసం ప్రణాళిక మరియు నిర్వహణ బాధ్యత తగిన సంస్థకు ఉంటుంది.

(vi) క్రొత్త నీటి వనరుల ఏర్పాటు కూడా చిన్నతరహా నీటి వనరుల ప్రణాళికలో భాగంగా ఉంటుంది.

(vii) మరమ్మత్తులు, పునరుద్ధరణ చర్యలు సీజన్‌ల వారీగా ఆయకట్టు నిర్ణయం, నీటి రెటేను విధించడం, వాటి వసూళ్ళు, వినియోగం వంటివన్నీ చిన్నతరహా నీటి వనరుల నిర్వహణలో బాగంగా ఉంటాయి.

(viii) ఆయా గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, తగిన ప్రభుత్వ సంస్థ, సముచిత నీటి రేటును వసూలు చేసి అందుకు సంబంధించిన అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టడానికి వీలుగా సంబంధిత నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నట్లయితే వాటి మధ్య కుదుర్చుకున్న దామాషా ప్రకారం పంచుకోవాలి.

(ix) చిన్నతరహా నీటి కుంటల నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం అవసరమైన నిధులు ప్రభుత్వం సమకూర్చాలి. ఈ గ్రాంటును దామాషా ప్రకారం ఆయా గ్రామ పంచాయతీ ఖాతాకు బదిలీచేయాలి.

**(7) షెడ్యూల్డు ప్రాంతాలలో చిన్నతరహా ఖనిజాలు:**

**చిన్నతరహా ఖనిలాల అన్వేషణ కోసం లైసెన్సు లేదా మైనింగు లీజుల మంజూరు :**

(i) చిన్నతరహా ఖనిజాల అన్వేషణ కోసం లైసెన్సు, గనుల త్రవ్వకం కౌలు మంజూరుకు లేదా వేలం ద్వారా చిన్నతరహా ఖనిజాల తవ్వకాల విషయంలో మంజూరు కాబడే రాయితీలు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తులు లేదా స్థానిక షెడ్యూల్డు తెగలకు చెందిన సభ్యులతో కూడిన సంఘాలు మాత్రమే అర్హత కలిగి ఉంటాయి.

(ii) షెడ్యూల్డు ప్రాంతాలలో చిన్నతరహా ఖనిజాల అన్వేషణ, లైసెన్సులకోసం లేదా గనుల త్రవ్వకం లీజు మంజూరుకోసం అందిన అన్ని దరఖాస్తులను మైనింగ్ డిపార్ట్‌మెంటు సంబంధిత గ్రామ పంచాయతీకి పంపాలి.

(iii) వ్యక్తిగతంగా లేదా గిరిజన సొసైటీలు, లేదా గిరిజన మైనింగ్ కార్పొరేషన్ విషయంలో అందిన దరఖాస్తులపై తమ ఆమోదాన్ని లేదా నిరాకరణను నాలుగు వారాలలోపు తీర్మానంద్వారా తెలియజేయాలి.

(iv) గ్రామ పంచాయతీ నిర్ణయాలే అంతిమమైనది. వాటికి కట్టుబడి ఉండాలి.

**(8) గ్రామ పంచాయతీ, మండల పరిషత్తుల అధికారాలు, విధులు:**

**(I) ఎక్సైజ్:**

(ఎ) గ్రామంలో మద్యం ఉత్పత్తి లేదా తయారీ కోసం మద్యం ఉత్పత్తి యూనిట్‌ను నెలకొల్పాలనే ఉద్దేశ్యంపై సంబంధిత గ్రామ సభ అభిప్రాయం కొరకు సంబంధిత శాఖ తెలియపరచాలి. గ్రామసభ 4 వారాలలోపు ఒక తీర్మానం రూపంలో తమ అభిప్రాయాన్ని తెలియజేయాలి. గ్రామసభ తీర్మనం ఆధారంగా గ్రామంలో మద్యం ఉత్పత్తి/తయారీ విషయంలో సంబంధిత శాఖ నిర్ణయాన్ని సంబంధిత గ్రామసభకు తెలియజేయాలి.

(బి) గ్రామంలో మద్యం దుకాణాలు తెరవడానికి కావలసిన లైసెన్సులను మంజూరు చేయడానికి ముందుగా గ్రామసభను సంప్రదించాలి.



గ్రామసభ నాలుగు వారాలలోపు తమ అభిప్రాయాన్ని తీర్మనం ద్వారా తెలియజేయాలి. లైసెన్సు కేవలం స్థానిక గిరిజనులకు మాత్రమే మంజూరు చేయాలి.

(సి) గ్రామంలో మద్యం దుకాణం/బార్‌ను ప్రారంభించడానికి కావలసిన లైసెన్సును మంజూరు చేస్తున్నట్లు లేదా నిరాకరిస్తునట్లుగా సంబంధిత శాఖ వ్రాత పూర్వక ఉత్వర్వు ద్వారా గ్రామ సభకు తెలియచేయాలి. ఈ విషయంలో గ్రామసభ తీర్వానానికి కట్టుబడి ఉండాలి, అదే అంతిమమైనది.

(డి) గిరిజనుల వివాహాలు, ఇతర సామాజిక మతపరమైన వేడుకలో మరియు వారి సాంస్కృతిక గుర్తింపు కోసం అమ్మడానికి వీలులేకుండా కేవలం స్థానికంగా మద్యాన్ని సేవించడానికి వారి వారి గ్రామంలో నివసించే షెడ్యూల్డు తెగల వారు బట్టీ/ఉత్పత్తి చేయడానికి సాంప్రదాయ మద్యం పరిమాణాన్ని గ్రామసభ నిర్ణయించాలి.

**(II) చిన్న తరహా అటవీ ఉత్పత్తుల యాజమాన్యం మరియు విక్రయము:**

(ఎ) ట్రేడ్ రెగులేషన్ 1979 (జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 20, యస్. డబ్ల్యు (ఎఫ్2) శాఖ, తేది 14-02-1983) కింద వెదురు మరియు బీడీ ఆకులు మినహాయించి, చిన్నతరహా అటవీ ఉత్పత్తుల సేకరణ విషయంలో జి.సి.సికి ఉన్న హక్కులకు లోబడే అటవీ శాఖ కార్యచరణ నిర్వహణ ప్రణాళిక అనుసరించి, శాస్త్రీయ పద్ధతులలో ఆయా అడవుల అభివృద్ధికి ఆయా డివిజన్‌లలో అటవీ శాఖ ఆధ్వర్యంలోనే వెదురు మరియు బీడీ ఆకుల నిర్వాహణ, కోత, విక్రయము వంటివి అటవీ శాఖ చేపడుతుంది. వెదురు, బీడీ ఆకుల పంటపై వచ్చే నికర ఆదాయాన్ని సంబంధిత గ్రామసభ ద్వారా సంబంధిత గ్రామసభ సభ్యులకు అటవీ శాఖ అందచేస్తుంది.

(బి) జనావాసాలలో చిన్నతరహా అటవీ ఉత్పత్తులు సంప్రదాయక సేకరణ, యాజమాన్యం, వినియోగం సంబందించిన హద్దుల విషయంలో వివాదాలు తలెత్తినప్పుడు సేకరణదారులు పరిష్కారం కోసం గ్రామసభకు తెలియపరచాలి.

(సి) చిన్నతరహా అటవీ ఉత్పత్తి యాజమాన్య హక్కులపై వచ్చిన వ్యక్తిగ సేకరణదారుల దరఖాస్తులను పరిశీలించిన తరువాత, వివాదాని పరిష్కరిస్తూ గ్రామసభ ఒక తీర్మానాన్ని చేయాలి.

(డి) గ్రామసభ తప్పనిసరిగా చిన్నతరహా అటవీ ఉత్పత్తి సేకరణదారుల పేర్లతో కూడిన ఒక రిజిస్టరును నిర్వహించాలి.

(ఇ) సంబంధిత ఐ.టి.డి.ఎ ప్రాజెక్టు అధికారి ఈ నియమాలు అమలును సమీక్షిస్తారు.

(ఎఫ్) ఆయా ఐ.టి.డి.ఎ పరిధిలోగల వెదురు మరియు బీడి ఆకుల ఉత్పత్తుల నిర్వహణా నిమిత్తము ఏర్పర్చే కమిటీకి ప్రాజెక్టు అధికారి అధ్యక్షులుగా వ్యవహరిస్తారు.

**(III) షెడ్యూల్డు ప్రాంతాలలోని భూముల అన్యాక్రాంతం నిరోధించడం మరియు అన్యాక్రాంతం కాబడిన గిరిజనుల భూమిని తిరిగి స్వాధీనం చేయడం:**

**(1) గ్రామసభ నిర్వహించవలసినవి:**

(ఎ) సాగుదార్లుతో సహా పట్టాదారుల పేర్లు కలిగివున్న భూమి విస్తీర్ణం వివరాలతో కూడిన భూ కమతాదారుల జాబితాను తయారుచేయాలి.

(బి) పట్టాదార్లలో గిరిజన కుల హక్కుల వాస్తవికతను విచారించాలి.

(సి) గిరిజన మహిళ పేరిట భూములు కొనుగోలు చేసి, గిరిజనేతరుడు అనుభవిస్నుదీ లేనిదీ పరిశీలించాలి.

(డి) కౌలు, తనఖా, ఇతరత్రా బదలాయింపుద్వారా భూములను తీసుకుని గిరిజనేతర్లు సాగు చేస్తున్నదీ లేదా భూముల సాగును అవసరమనుకుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.

(ఇ) ప్రభుత్వ భూమి అస్సైన్‌మెంటు కోసం లబ్దిదారుల జాబితాను ఆమోదించాలి.

(ఎఫ్) పైన (ఏ)-(ఇ) వరకు పేర్కొన్న అన్ని కేసులలో సమగ్ర దర్యాప్తు అనతరం కొన్ని భూముల సాగు భూ బదలాయింపు క్రమబద్దీకరణ (సవరణ) నిబంధనలు 1959కి విరుద్ధంగా ఉన్నాయని



భావించినట్లయితే ఆ ఉల్లంఘన వివరాలను పేర్కొంటూ గ్రామసభ ఒక తీర్మానాన్ని ఆమోదించాలి. భూ బదలాయింపు క్రమబద్దీకరణ (సవరణ) నిబంధనలు 1959 క్రింద వ్యవహరించే అధికారి వాటిపై తదుపరి చర్యలు చేపట్టాలి.

(2) భూముల స్వాధీన విషయంలో తలెత్తే వివాదాలపై గ్రామసభ సమావేశాన్ని నిర్వహించి, సంబంధిత వారినుండి వారి హక్కుకు సంభందించిన ఋజువులను సమర్పించవలసిందిగా కోరి, దర్మిలా ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత భూ బదలాయింపు నిబంధన 1959 క్రింద సంబందిత అధికారిని తదుపరి చర్యలు చేపట్టవలసిందిగా కోరుతూ తగు తీర్మానం చేయవచ్చు.

(3) గిరిజనేతరులకు భూమి అన్యాక్రాంతం జరిగిందని ఏదైనా ఫిర్యాదుపై లేదా స్వయంగానే ఒక సమావేశాన్ని నిర్వహించి, సముచిత తీర్మానం చేసి ఆ భూమిని తిరిగి గిరిజనులకు స్వాధీనం చేసేందుకు అవసరమగు చర్యలకోసం సంబంధిత అధికారికి పంపాలి.

(4) గ్రామసభ తీర్మానాన్ని విబేధించేవారు తీర్మానం తేదీనుండి 60 రోజుల్లో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత భూ బదలాయింపు క్రమబద్ధీకరణ నిబంధనలు 1959 క్రింద సంబంధిత అధికారికి ఒక పిటీషను దాఖలు చేసుకోవచ్చు.

(5) ఆంధ్రప్రదేశ షెడ్యూల్డు ప్రాంత భూమి బదలాయింపు క్రమబద్ధీకరణ నిబంధనలు 1959 క్రింద వ్యవహరిస్తున్న అధికారి అటువంటి పిటీషనును అనుమతించడం లేదా తిరస్కరించడం లేదా పునః పరిశీలన కోసం తిరిగి సంబంధిత గ్రామసభకు పంపవచ్చు.

(6) అలా పంపబడిన పిటీషనును 30 రోజులలోపు గ్రామసభ సమావేశమై, వాదనలు విన్న తర్వాత నిర్ణయాన్ని, తీర్మానాన్ని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత భూమి బదలాయింపు క్రమబద్దీకరణ 1959 క్రింద వ్యవహరిస్తున్న అధికారికి పంపాలి.

(7) ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత భూమి బదలాయింపు క్రమబద్ధీకరణ

1959 క్రింద అధికారం ఉన్న అధికారి గ్రామసభ తీర్మానాన్ని తప్పనిసరిగా పరిశీలించి, పిటీషనును ఆమోదిస్తూ లేదా తిరస్కరిస్తూ సముచిత ఉత్తర్వును జారీ చేయాలి.

(8) ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత భూమి బదలాయింపు క్రమబద్ధీకరణ నిబంధనలు 1959 క్రింద వ్యవహరించు అధికారి గిరిజన మరియు గిరిజనేతరుల మధ్య నడిచే భూబదలాయింపు కేసులో అభిప్రాయంకోసం తప్పనిసరిగా సంబంధిత గ్రామసభను భాగస్థులుగా చేయాలి. సంబంధిత గ్రామసభ అభిప్రాయాన్ని తప్పనిసరిగా తగురీతిలో విచారించాలి.

(9) ప్రతీ గిరిజన, గిరిజనేతర భూమి కేసుల్లో తీర్పు ప్రతులను సంబంధిత గ్రామసభకు షెడ్యూల్డు ప్రాంత భూమి బదలాయింపు క్రమబద్ధీకరణ 1959 క్రింద వ్యవహరించు అధికారి సమకూర్చాలి.

(10) అన్యాక్రాంత భూమి గిరిజనునికి తిరిగి అప్పగింస్తున్నపుడు విచారణ అధికారి ఆ మేరకు గ్రామసబ సభ్యుని నుంచి సంతకాన్ని తీసుకోవాలి.

**(IV) గ్రామ మార్కెట్‌లు/ఫాండీస్/సంతలు/అంగడులు లేదా ఏ పేరుతో పిలిచినప్పటికీ వాటి నిర్వహణ:**

(1) షెడ్యూల్డు ప్రాంతాలలో గ్రామ సంతలు (ఏ పేరుతో పిలిచినప్పటికీ) నిర్వహించడానికి సంబందిత గ్రామ పంచాయతీయే మార్కెట్ కమిటీగా ఉంటుంది.

(2) షెడ్యూల్డు ప్రాంతంలో జరిగే వారం వారీ సంతలో (ఏ పేరుతో పిలిచినప్పటికీ) ఆయా గ్రామ పంచాయతీలు మార్కెట్ కమిటీగా ఈ క్రింద విధులను నిర్వహించాలి.

(ఎ) స్థానిక గిరిజనులకు మాత్రమే లైసెన్సు మంజూరు చేయాలి.

(బి) మార్కెట్ యార్డుల నిర్వహణ, పోషణ.



(సి) గ్రామ పంచాయతీలు మార్కెట్ యార్డులో లావాదేవీలు తాత్కాలిక నిలుపదల, మూసివేయడం ప్రారంభం చేయు అంశాల క్రమబద్ధీకరణ.

(డి) మార్కెట్ విధులు నిర్వమించే వ్యక్తులపై పర్యవేక్షణ.

(ఇ) లైసెన్సు షరతుల అమలు.

(ఎఫ్) వ్యవసాయ ఉత్పత్తులు, ఎన్.టి.ఎఫ్ (కపపేతర అటవీ ఫలసాయం), ఉత్పత్తి, పశు సంపద లేదా వాటి సంబంధిత ఉత్పత్తులు, అందుకు సంబంధించిన అన్ని మార్కెటింగ్ అంశాల విషయంలో అమ్మకపు ఒప్పందాలు, అమలు లేదా రద్దు, తూకాలు, బట్వాడా, చెల్లింపులు వంటి ఇతర అంశాల క్రమబద్దీకరణ.

జీవనోపాధి కోసం ప్రజలు లేదా అటవీ ఉత్పత్తుల సేకరణ వ్యక్తులు విక్రయం/వినియోగం కోసం అటవీ ప్రాంతాల్లో తలమోపు, సైకిల్, తోపుడుబండ్ల ద్వారా రవాణా స్థానిక స్థాయిలో ప్రాసెసింగ్, అదనపు విలువ సమకూర్చడం వంటి విషయాలన్నీ చిన్నతరహా అటవీ ఉత్పత్తుల అమ్మకంలోకే వస్తాయి.

(జి) మార్కెట్ ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తి, ఎన్.టి.ఎఫ్. ఉత్పత్తి మరియు పశు సంపద లేదా పశు సంపద ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అవసరమగు సౌకర్యాలను సమకూర్చడం.

(హెచ్) ప్రకటిత వ్యవసాయ ఉత్పత్తులు, ఎన్.టి.ఎఫ్, పశు సంపద లేదా పశు ఉత్పత్తులు, ఇతర ఉత్పత్తులకు సంబంధించిన వ్యాపార లావాదేవీలలో కొనుగోలు దారుడు అమ్మకం దారులకు ఇతరులకు మధ్య ఉత్పన్నమయ్యే అన్ని వివాదాలకు పరిష్కారాన్ని చూపడం.

(ఐ) ఈ క్రింది సంబంధిత విషయములపై సమాచార సేకరణ, నిర్వహణ వ్యాప్తి.

(i) ప్రకటిత వ్యవసాయ ఉత్పత్తులు, పశు సంపద, పశు సంబంధిత ఉత్పత్తులు, ఇతర ఉత్పత్తి విక్రయ ధరలు మార్పులు.

(ii) ప్రకటిత సరుకుల ఉత్పత్తి, ప్రాసెస్సింగ్, నిల్వ.

(జె) కల్తీల నివారణ, గ్రేడింగు ప్రామాణీకరణ పెంపొందించేందుకు సాధ్యమయిన అన్ని చర్యలు తీసుకోవడం.

(కె) పంచాయతీ వసూలు చేయదగిన ఫీజు, చందాలు ఇతర మొత్తాల విధింపు, వసూళ్ళు, స్వీకరణ.

(ఎల్) షెడ్యూల్డు ప్రాంతాలో పైన పేర్కొన్న నిబంధనలను సమగ్ర అమలు కోసం అవసరమగు అధికారులను వారి సిబ్బందిని నియమించడం.

(ఎం) ప్రకటిత వ్యవసాయ ఉత్పత్తులు, పశుగణ, వాటి సంబంధిత ఉత్పత్తులు మార్కెట్ నిబంధనలకు అనుకూలంగా, వేలాన్ని నిర్వహించాలి.

(ఎన్) ప్రకటత వస్తువుల తూకాలు సక్రమంగా ఉండునట్లు చర్యలు తీసుకోవాలి.

(ఒ) మార్కెట్ యార్డులో వ్యక్తులు మరియు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం.

(పి) సంబంధిత శాఖ నియమాల ప్రకారం పై నియమాలు అతిక్రమించిన వారిని ప్రాసిక్యూట్ చేయడం.

(క్యు) దావా, చర్య, ప్రొసిడింగ్, దరఖాస్తులు లేదా మధ్యవర్తిత్వం ఆరంభించడం లేదా ఎదుర్కొవడం, లేదా వాటికి రాజీ పడటం.

(ఆర్) ఉత్పత్తిదార్లు ప్రత్యక్షంగా తాను పండించిన దానిని అమ్ముకోవడానికి వీలు కల్పించడం. కమిషన్ ఏజెంటు లేకుండా నేరుగా తన ఉత్పత్తులు వ్యాపారికి అమ్ముకొనేందుకు ఉత్పత్తి దార్ల తరపున ఇన్‌వాయిస్ మరియు బిల్లులు తయారీకి సహకరించడం, వాటికి కావలసిన అన్ని సౌకర్యములను సమకూర్చడం.

(ఎస్) మార్కెట్లు ఏర్పాటు, అభివృద్ధి విషయంలో ఎప్పటికప్పుడు జారీచేసే ప్రభుత్వ ఆదేశాలను అమలు పరచడం.

## (V) గిరిజనులకు అప్పలు ఇవ్వడం పై నియంత్రణ:

(i) షెడ్యూల్డు ప్రాంతాలలో ప్రైవేట్ వడ్డీ వ్యాపార సంస్థలకు లైసెన్సు మంజూరు చేయకూడదు.



## (VI) అన్ని సామాజిక రంగాలలోని పనిచేయు సంస్థలు, సిబ్బందిపై నియంత్రణ:

### (i) విద్య :

(ఎ) సంబంధిత గ్రామ పంచాయతీలద్వారా అన్ని విద్యా సంస్థల పరిపాలన నివేదికలను కోరే అధికారం మండల ప్రజా పరిషత్‌కు ఉంటుంది.

(బి) మండల పరిషత్తు పరిధిలోగల అన్ని విద్యా సంస్థల బడ్జెట్‌ను మే 31 తేదీ నాటికి అంటే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఆమోదించాలి.

(సి) తవు పరిధిలో ఉన్న అన్ని విద్యా సంస్థలలోని హాజరు మరియు ఉపాధ్యాయుల సక్రమ విధుల పర్యవేక్షణ, మరియు అక్రమపద్ధతులకు పాల్పడే ఉపాధ్యాయులపై తగిన క్రమశిక్షణ చర్యల కోసం సంబంధిత క్రమశిక్షణా అధికారికి మండల పరిషత్తు నివేదించాలి. ఆయా సంబంధిత గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్తుకు తెలియపరుస్తూ సంబంధిత శిక్షణాధికారి చర్య తీసుకోవాలి.

### (ii) సంక్షేమం వసతి గృహాల నిర్వహణ:

(ఎ) మండల పరిషత్తు తన పరిధిలోని వసతి గృహాలలో విద్యార్థులకు ఆహార సరఫరా, మరమ్మతులు మరియు ఇతర దైనందిన కార్యక్రమాల నిర్వహణ పర్యవేక్షించాలి.

(బి) తన పరిధిలోని వసతి గృహ సంక్షేమ అధికారులనుండి విద్యా సంవత్సరంలో రెండు పర్యాయాలు వసతి గృహాల పరిపాలన నివేదికను మండల ప్రజాపరిషత్తు కోరాలి.

(సి) వసతి గృహాలలో విద్యార్థులను చేర్చుకొను విషయములో సిఫార్సులు చేయు అధికారాన్ని మండల పరిషత్తు కలిగి ఉంటుంది.

(డి) విధులకు గైర్హాజరు మరియు సక్రమంగా విధులు నిర్వహించని వసతి గృహాల సంక్షేమ అధికారులు మరియు ఇతర సిబ్బందిపై తగు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మండల పరిషత్తు సంబంధిత క్రమశిక్షణ అధికారికి సిఫార్సు చేయాలి. క్రమశిక్షణాధికారి ఆయా

సందర్భాన్ని బట్టి మండల పరిషత్తుకు లేదా గ్రామ పంచాయతీకి తెలియపరుస్తు చర్య తీసుకోవాలి.

**(iii) ఆరోగ్యం:**

పంచాయతీ రాజ్ సంస్థలు తమ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల/ సంస్థలకు మద్దతును, మార్గదర్శకత్వాన్ని, సమీక్షచేస్తూ ఈ క్రింది అంశాలపై ప్రత్యేక దృష్ట చూపాలి.

(ఎ) రూరల్ హెల్త్ మిషనులో భాగంగాఉన్న జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం మరియు అన్ని ఇతర పథకాల సమీక్ష మరియు పర్యావేక్షణ.

(బి) మందుల సరఫరా మరియు వాటి వాడకాన్ని సమీక్షించడం.

(సి) గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య విస్తరణ కార్యకలాపాల సమీక్ష మరియు పర్యవేక్షణ.

(డి) వ్యాధులు ప్రబలకుండా నిరోధించుటకు తీసుకున్న చర్యలు సమీక్ష, పర్యవేక్షణ.

(ఇ) గ్రామీణ ప్రాంతాలలో వైద్య ఆరోగ్య సంస్థల నిర్మాణాలు, పరిసరాలను పరిశుభ్రత మున్నగు విషయాలపై సమీక్ష, పర్యవేక్షణ.

(ఎఫ్) గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పంచాయతీరాజ్ సంస్థలే అంటే గ్రామస్థాయిలో గ్రామ పంచాయితీ, మండలంలో మండల ప్రజా పరిషత్తు, మరియు జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్తులు .వాటి పరిధిలోగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును స్వయంగా నిర్వహిస్తాయి.

(జి) పంచాయతీరాజ్ సంస్థలు గ్రామాలలో రక్షిత నీటి సరఫరా, పరిశుభ్రత, పారిశుధ్య వంటి కార్యక్రమాల యాజమాన్య బాధ్యత తీసుకుంటాయి.

(హెచ్) ఆరోగ్య కేంద్రాల పనితీరు మెరుగుదలకు ఏమైన సూచనలు పంచాయతీరాజ్ సంస్థలు చేసినప్పుడు, సంబంధిత అధికారులు వాటిపై తీసుకున్న చర్యల నివేదికను పంపించే బాధ్యత వహించాలి.



ఆయా గ్రామ పంచాయతీ, మండల పరిషత్తు మరియు జిల్లా పరిషత్తు నిర్వహించే సర్వ సభ్య సమావేశానికి, ఏ.ఎన్.ఎం, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వరసగా హాజరవుతారు.

(ఐ) ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి లేదా ఏ.ఎన్.ఎం లేదా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఆరోగ్యానికి సంబంధించిన అంశాలు లేదా పరిశుభ్రత, పారిశుధ్య మెరుగుదలకు మరియు రక్షిత నీటి సరఫరా విషయమై చేసిన సూచనలను పంచాయతీరాజ్ సంస్థల్లో పనిచేసే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, తీసుకున్న చర్య నివేదికను సంబంధిత ఆరోగ్య అధికారి లేదా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి పంపాలి.

(జె) మండల పరిషత్తు పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరియు సబ్ సెంటర్ల బడ్జెట్‌ను ఆమోదించాలి.

(కె) ఆర్థిక సంవత్సరం ప్రారంభమయిన నెలలోపు తన పరిధిలోగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరియు సబ్ సెంటర్ల పరిపాలన నివేదికలను మండల పరిషత్తు కోరాలి.

**(iv) మహిళా, శిశు సంక్షేమం:**

(ఎ) అంగన్‌వాడి కేంద్రాల బడ్జెట్‌ను గ్రామసభ ఆమోదించాలి.

(బి) ఆర్థిక సంవత్సరం ప్రారంభమయిన నెలలోగా తమ పరిధిలోగల ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్టు అధికారి నుండి పరిపాలన నివేదికలను మండల పరిషత్తు కోరాలి.

(సి) గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడి వర్కర్లు అంటే హెల్పర్లు, వర్కర్లను నియామకం మరియు వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకొవడానికి గ్రామ పంచాయతీకి అధికారం ఉంటుంది.

(v) గిరిజన ఉప ప్రణాళికతో సహా స్థానిక ప్రణాళికలు, వనరులపైన నియంత్రణ:

(ఎ) ఆర్థిక సంవత్సరం ఆరంభమయినప్పటి నుండి నెలలోగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా సంబంధిత జిల్లా కలెక్టర్లకు తదుపరి జిల్లా కలెక్టర్లు మండలాల వారీగా మండల పరిషత్తులకు గిరిజన ఉపప్రణాళిక కేటాయింపు (భౌతిక మరియు ఆర్థిక) వివరాలను తెలియజేయాలి.

(బి) గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంవత్సరం ప్రారంభమయిన నెలలోగా గిరిజన ఉప ప్రణాళిక భౌతిక, ఆర్థిక కేటాయింపులు వివరాలను మండల పరిషత్తు అభివృద్ధి అధికారి తెలియచేయాలి.

(సి) నెలకు ఒకసారి మండల పరిషత్తు, గ్రామ పంచాయతీ వారివారి పరిధిలో జరుగు గిరిజన ఉప ప్రణాళిక అభివృద్ధి అమలును సమీక్షించాలి.

(డి) గిరిజన ఉప ప్రణాళిక అమలుపై పరిపాలన/నివేదికలను సంబంధిత జిల్లా కలెక్టరుగారి ద్వారా మండల పరిషత్తు, గ్రామ పంచాయతీ ప్రభుత్వానికి సమర్పించాలి.

## (9) అప్పీలు, పునఃవిచారణ, సమీక్షాధికారం :

(i) గ్రామసభ తీర్మానాన్ని విభేధించే వ్యక్తి లేదా సంస్థ అట్టి తీర్మానం ఆమోదం పొందిన 60 రోజులలోగా కమీషనరుకు అప్పీల్ చేసుకోవచ్చు. గ్రామసభ నిర్ణయాల వాస్తవికత లేదా చట్ట బద్ధత గురించి విచారణ జరిపి, గిరిజనుల ప్రయోజనాలకు హాని జరగకుండా ఉండే ఆదేశాలు కమీషనరు జారీ చేయవచ్చు.

(ii) కమీషనరు జారీచేసిన ఆదేశం/ఉత్తర్వు విభేదించు లేదా వ్యక్తి/సంస్థ అవి వెలువడిన 90 రోజులల్లోగా ప్రభుత్వాన్ని పునఃవిచారణ జరపమని పిటీషన్ దాఖలు చేయవచ్చు.

(iii) కమీషనర్ ఉత్తర్వులను సమీక్షించి గిరిజనుల ప్రయోజనాల హని కలుగకుండా తగు ఉత్తర్వులు జారీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.



## 2) ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంత పంచాయితీరాజ్ (పెసా) చట్టం1998 (ఏక్ట్ 7/98)

ఈ చట్టం ఏప్రిల్ 1998 నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టంలో పేర్కొనబడిన నియమాలు భారత రాజ్యాంగ అధికరణ 244 క్రింద సూచించబడిన రాష్ట్ర షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తిస్తాయి.

షెడ్యూల్డు ప్రాంత గ్రామ పంచాయితీ, మండల, జిల్లా పరిషత్‌లకు సంబంధించిన ప్రత్యేక నియమాలు.

### 242 ఎ

1) రాష్ట్ర షెడ్యూల్డు ప్రాంతంలో గల గ్రామ పంచాయితీ మండల పరిషత్, మరియు జిల్లా పరిషత్‌లకు ఈ నియమాలు వర్తిస్తాయి.

2) ఈ నియమాలు వీటికి భిన్నంగా ఉన్న ఇతర పంచాయితీరాజ్ చట్టాంశాలను అధిగమిస్థాయి.

### 242 బి

ఆచార, సంప్రదాయాల ప్రకారం వారి వ్యవహారాలు నిర్వహించుకుంటూ నివసిస్తున్న ప్రజల స్థావరాల సముదాయం లేదా శివారు గ్రామం లేదా శివారు గ్రామాలను "గ్రామం" గా పరిగణిస్తారు.

### 242 సి

1) ప్రస్తుతం అమలులో గల చట్టాలకు, సంప్రదాయబద వివాద పరిష్కార పద్ధతులకు భిన్నంగా కాకుండా ప్రజల ఆచార సాంప్రదాయాలు పరిరక్షించేందుకు 'గ్రామసభ'కు అధికారం ఉంటుంది.

2) ఎ) గ్రామ స్థాయిలో గ్రామ పంచాయితీ చేపట్టే సామాజిక మరియు ఆర్థిక అభివృద్ధి పథకాల అమలుకు గ్రామసభ ముందుగా అనుమతినివ్వాలి.

బి) పేదరిక నిర్మూలనా పథకం మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాల క్రింద లబ్ధిదారుల గుర్తింపు మరియు ఎంపికచేసే బాధ్యత ఉంటుంది.

సి) అభివృద్ధి పథకాల ప్రణాళికల క్రింద గ్రామ పంచాయితీలు ఖర్చు చేసిన నిధులకు వినియోగ ధృవీకరణ పత్రం ఆయా గ్రామసభల నుండి పొందాలి.

**242 డి**

షెడ్యూల్డు ప్రాంత మండల పరిషత్ మరియు గ్రామ పంచాయితీల పరిధిలో గల జనాభా ప్రాతిపదికపై ఆయా మండల పరిషత్ మరియు గ్రామ పంచాయితీల ఎన్నికలలో స్థానాలు కేటాయించాలి.

మొత్తం సీట్లలో ఒకటిన్నరకు తగ్గకుండా షెడ్యూల్డు తెగల వారికి రిజర్వేషన్లు ఉంటాయి.

గ్రామ పంచాయితీ సర్పంచ్ మరియు మండల పరిషత్ అధ్యక్ష స్థానాలు షెడ్యూల్డు తెగల వారికి కేటాయింపు.

**242 ఇ**

మండల పరిషత్‌లలో ఏ షెడ్యూల్డు తెగల వారికైనా ప్రాతినిధ్యం లభించకపోతే ఆ గిరిజన తెగల వారిని నామినేట్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. ఆ విధంగా నామినేట్ చేయబడిన వారి సంఖ్య మండల పరిషత్‌లకు ఎన్నిక కాబడుతున్న వారి సంఖ్యలో 1/10 వంతుకు మించరాదు.

**242 ఎఫ్**

షెడ్యూల్డు ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం కొరకు చేపట్టే భూ సేకరణ విషయంలో మరియు నిర్వాసితులయ్యే వారి పునరావాసం విషయంలో ముందుగా మండల పరిషత్‌లను సంప్రదించాలి. ప్రాజెక్టు ప్రణాళిక రచన మరియు దాని అమలు రాష్ట్రస్థాయిలో సమన్వయ పర్చబడుతుంది.

**242 జి**

చిన్న తరహా నీటివనరులు ప్రణాళిక మరియు నిర్వహణ బాధ్యత ఆయా గ్రామపంచాయితీ, మండల పరిషత్ లేదా జిల్లా పరిషత్‌లకు అప్పగించడం.



**242 హెచ్**

(1) షెడ్యూల్డు ప్రాంతాంలో గల లఘు ఖనిజాల సర్వే లైసెన్సు లేదా మైనింగు లీజులు మంజూరు చేసే ముందు గ్రామ పంచాయితీ సిఫార్సులను పరిగణలోకి తీసుకోవాలి.

(2) వేలం ద్వారా లఘు ఖనిజాలు వెలికి తీసుకొనేందుకు ఇవ్వబడే రాయతీల విషయంలో ముందుగా గ్రామ పంచాయితీ సిఫార్సులను పరిగణలోకి తీసుకోవాలి.

**242 ఐ**

(1) ప్రభుత్వం పేర్కొనబడిన విధంగా గ్రామ పంచాయితీ లేదా గ్రామసభ ఈ క్రింది అధికారాలు ఉంటాయి.

ఎ) మద్యపాన నిషేధం అమలు లేదా వినియోగ క్రమబద్ధీకరణ లేదా అమ్మకాలపై ఆంక్షలు విధించే అధికారం.

బి) చిన్న తరహా అటవీ ఫలసాయంపై యాజమాన్యం.

సి) షెడ్యూల్డు ప్రాంతంలో అన్యాక్రాంతం కాబడిన గిరిజన భూమిని స్వాధీనపర్చడం.

డి) గ్రామ సంతల నిర్వహణ.

ఇ) గిరిజనులతో చేసే వడ్డీ వ్యాపారంపై నియంత్రణాధికారం.

(2) మండల పరిషత్‌కు ఈ క్రింది అధికారాలు ఉంటాయి.

ఎ) సామాజిక రంగంలో పనిచేసే సంస్థలపై మరియు వాటితో పనిచేసే వారిపై నియంత్రణ.

బి) ఉప ప్రణాళిక ప్రాంతంతో సహా అన్ని స్థానిక ప్రణాళికల మరియు వనరులపై నియంత్రణ.

## 3. కేంద్ర షెడ్యూల్డు ప్రాంత పంచాయతీ రాజ్ విస్తరణ చట్టం (పెసా) 1996

## పంచాయితీ చట్ట నిబంధనలు ( షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరణ) చట్టం 1996

1. ఈ చట్టాన్ని పంచాయతీ నిబంధనలు (షెడ్యూల్డు ప్రాంతాల విస్తరణ చట్టం 1996)గా పిలువబడుతుంది.

2. షెడ్యూల్డు ప్రాంతాలు "అంటే భారత రాజ్యాంగంలోని 244 అధికరణలో క్లాజు 11లో పేర్కొనబడిన ప్రాంతాలు.

3. సెక్షన్ 4లో పేర్కొనబడిన మినహాయింపులు మార్పులకు లోబడి భారత రాజ్యాంగంలో తొమ్మిదవ భాగంలో పంచాయతీలకు సంబంధించిన నియమాలు షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తిస్తాయి.

4. ఈ క్రింది పేర్కొనబడిన నియమాలకు భిన్నంగా భారతరాజ్యాంగం తొమ్మిదవ భాగంలో పేర్కొనబడిన నియమాలతో నిమిత్తం లేకుండా ఏ రాష్ట్ర శాసనసభ చట్టాలు చేయడానికి వీలులేదు.

ఎ) ఆచార, సంప్రదాయాలు, సామాజిక మరియు మతపరమైన పద్ధతులు మరియు సామాజిక వనరుల నిర్వహణ సాంప్రదాయ పద్ధతులకు అనుగుణంగానే రాష్ట్ర శాసనసభలు పంచాయతీ చట్టాలు రూపొందించాలి.

బి) ఆచార, సంప్రదాయా ప్రకారం వారి వ్యవహారాలు నిర్వహించుకుంటూ నివశిస్తున్న ఆవాసం, ఆవాసాల సముదాయం లేదా శివారు గ్రామం లేదా శివారు గ్రామాలను "గ్రామం"గా పరిగణిస్తారు.

సి) గ్రామ పంచాయతీ ఎన్నికల జాబితాలో చేర్చబడిన వ్యక్తులందరు ప్రతి గ్రామంలో ఉండే గ్రామ సభలో సభ్యులు.

డి) ప్రజల ఆచార సంప్రదాయాలు వారి సాంస్కృతిక గుర్తింపు ఉమ్మడి వనరుల పరిరక్షణ మరియు సంప్రదాయ పద్ధతులలో వివాదాలు పరిష్కరించుకొనే అధికారం గ్రామసభకు ఉంటుంది.



ఇ) గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ చేపట్టే సామాజిక మరియు ఆర్థిక పథకాల ప్రణాళికల అమలుకు ముందుగా గ్రామసభ అనుమతి పొందాలి.

పేదరిక నిర్మూలన పథకం మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాల కింద లబ్ధిదారులు గుర్తింపు మరియు ఎంపిక చేసే బాధ్యత.

ఎఫ్) 'ఇ' సెక్షనులో పేర్కొనబడిన అభివృద్ధి పథకాల ప్రణాళికల కింద చేసిన నిధుల ఖర్చుకు వినియోగ ధృవీకరణ పత్రం ఆయా గ్రామ పంచాయతీలు గ్రామసభల నుంచి పొందాలి.

జి) గ్రామ పంచాయతీ ప్రాతిపధికపై భారత రాజ్యాంగం తొమ్మిదవ భాగంలో రిజర్వేషను కల్పించిన ఆయా కులాల జనాభా ప్రాతిపదికపై షెడ్యూల్డు ప్రాంతాలలో పంచాయతీలకు రిజర్వేషన్లు ఉంటాయి. అయితే మొత్తం సీట్లలో షెడ్యూల్డు తెగల వారికి ఒకటిన్నర కంటే తగ్గకుండా ఉండాలి. అన్ని పంచాయతీ స్థాయిలలో చైర్మన్ పదవులు గిరిజనులకు కేటాయించబడ్డాయి.

హెచ్) మధ్యంతర స్థాయి లేదా జిల్లా స్థాయి పంచాయతీలలో ఏ షెడ్యూల్డు తెగల వారికైనా ప్రాతినిద్యం లభించనిచో ఆ గిరిజన తెగల వారిని నామినేట్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. అయితే ఆ విధంగా నామినేట్ చేయబడిన వారి సంఖ్య ఆయా పంచాయతీ సంస్థలకు ఎన్నిక కాబడుతున్న వారి సంఖ్యలో 1/10 వంతుకు మించరాదు.

ఐ) షెడ్యూల్డు ప్రాంతాలలో అభివృద్ధి ప్రాజెక్టు నిర్మాణాల కొరకు చేపట్టే భూసేకరణ విషయంలో మరియు నిర్వాసిత్వానికి గురికాబడే వారి పునరావాసం విషయంలో ముందుగా గ్రామసభ లేదా గ్రామ పంచాయతీలను సంప్రదించాలి. ప్రాజెక్టు ప్రణాళిక రచన మరియు అమలు విషయంలో రాష్ట్ర స్థాయిలో సమన్వయి పర్చుడం జరుగుతోంది.

జె) చిన్నతరహా వనరులు (చెర్వులు, కాలువలు, కుంటలు)నిర్వహణ బాధ్యత ఆయా స్థాయి పంచాయతీలకు అప్పగించాలి.

కె) షెడ్యూల్డు ప్రాంతాలలో లఘు ఖనిజాల మైనింగ్ లీజులు లేదా సర్వే లైసెన్సులు జారీచేయడానికి ముందుగా ఆయా గ్రామ సభ లేదా గ్రామపంచాయతీ సిఫార్సులు ఖచ్చితంగా పరిగణలోకి తీసుకోవాలి.

ఎల్) వేలం ద్వారా లఘు ఖనిజాలు వెలికి తీసుకొనేందుకు ఇవ్వబడే రాయతీల విషయంలో గ్రామ సభ లేదా గ్రామ పంచాయతీ సిఫార్సులు తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలి.

ఎమ్) షెడ్యూల్డు ప్రాంతాలలో పంచాయతీలు స్వపరిపాలన సంస్థలుగా రూపుదిద్దుకొవడానికి వీలుగా గ్రామసభలకు మరియు ఆయా పంచాయతీ స్థాయికి ఈ క్రింది అధికారాలు రాష్ట్ర శాసనసభ సమకూర్చాలి.

(1) మద్యపాన నిషేదం అమలు లేదా వినియోగ క్రమబద్ధీకరణ లేదా అమ్మకాలపై ఆంక్షలు విధించడం.

(2) చిన్నతరహా అటవీ ఫలసాయంపై యాజమాన్యం

(3) షెడ్యూల్డు ప్రాంతాలలో గిరిజనుల భూమి అన్యాక్రాంతం కాకుండా నిరోధించడం లేదా చట్ట వ్యతిరేకంగా అన్యాక్రాంతం కాబడిన గిరిజనుల భూమిని తిరిగి స్వాధీన పర్చుకొనేందుకు తగు చర్యలు తీసుకొనే అధికారం.

(4) గ్రామసంతల నిర్వహణ.

(5) గిరిజనులతో చేసే వడ్డీ వ్యాపారంపై నియంత్రణాధికారం.

(6) సామాజిక రంగంలో పనిచేసే సంస్థల పని తీరుపై నియంత్రణ.

(7) ఉప ప్రణాళిక ప్రాంతంతో సహా అన్ని స్థానిక ప్రణాళికల మరియు వనరులపై నియంత్రణ.

ఎన్) దిగువ స్థాయి పంచాయతీ/గ్రామసభల అధికారాలు ఎగువస్థాయి పంచాయతీలు కబళించకుండా అన్ని స్థాయి పంచాయతీలు స్థానిక స్వపరిపాలన సంస్థలుగా రూపొందేలా తగు అధికారాలు రాష్ట్ర శాసనాలలో పొందుపర్చాలి.



ఒ) షెడ్యూల్డు ప్రాంతాలలో జిల్లాస్థాయిల పంచాయతీ పరిపాలనా ఏర్పాట్లు 6వ షెడ్యూలు కింద సూచించిన పాలనా పద్దతిగా ఉండేటట్లు రాష్ట్ర శాసన సభ చూడాలి.

5. ఈ చట్టం అమలులోకి రాకముందు అమలులో ఉన్న పంచాయతీ చట్ట నియమాలు ఈ చట్టానికి భిన్నంగా ఉన్నట్లయితే అవి ఆయా రాష్ట్ర శాసనసభలు సవరణ లేదా రద్దు చేసేంతవరకు కొనసాగుతాయి లేదా ఈ చట్టం రాష్ట్రపతి ఆమోదం పొందిన తేది నుండి ఒక ఏడాది వరకు మాత్రమే అమలులో ఉంటాయి. అలాగే ప్రస్తుతం ఉన్న పంచాయతీ సంస్థలు ఆయా రాష్ట్ర శాసనసభలు రద్దు చేసేంత వరకు లేదా వాటి పూర్తికాల పరిమితి అయ్యేంతవరకు కొనసాగుతాయి.

# 4. గ్రామ పంచాయితీలకు అధికారాల బదిలీ-ప్రభుత్వ ఉత్తర్వులు

## 1. పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ

### 1. వాటర్ షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు :-

ఎ) వాటర్ షెడ్ ప్రాజెక్టుల ప్రణాళికల తయారు మరియు అమలులో పాల్గొనుట.

బి) గ్రామసభ ద్వారా వాటర్ షెడ్ ప్రాజెక్టుల యందు భూమి/నీరు వినియోగ ప్రణాళికలను ఆమోదించుట.

సి) వాటర్ షెడ్ ప్రాజెక్టుల అమలు యందు ప్రత్యక్ష భాగస్వామ్యం కొరకు స్వయం సహాయక సంఘాల, గ్రామ సమైఖ్యసంఘాల వినియోగదారుల గ్రూపుల ఏర్పాటుకు సహకరించుట.

డి) వాటర్‌షెడ్ ప్రాజెక్టుల ద్వారా ఏర్పడిన ప్రజల ఉమ్మడి ఆస్థులను నిర్వహించుట.

ఇ) పనుల ప్రగతిని పర్యవేక్షించుట, నాణ్యతను పరిశీలించుట.

ఎఫ్) వాటర్‌షెడ్ ప్రాజెక్టుల కింద వ్యక్తిగత పనులను చేపట్టడానికి కావలసిన లబ్దిదారుల ఎంపిక మరియు అవసరమగు సహాయము అందించుట.

జి) పనుల ప్రగతిని అనుసరించి మండల పరిషత్తుల ద్వారా గ్రామపంచాయితీలకు జిల్లా నిటి యాజమాన్య సంస్థ నిధులను విడుదల చేస్తుంది. వాటర్ షెడ్ ప్రాజెక్టు అమలు కాలమందు సెక్రటరీ సేవలను గ్రామపంచాయితీ వినియోగించుకొనవచ్చును.

### 2. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం :-

ఎ) వార్షిక శ్రామిక బడ్జెట్‌ను తయారు చేయుట, ఆమోదించుట.

బి) ఉపాధి పనులను గుర్తించుట



సి) ఉపాధి ద్వారా వేతనాలు కోరే వారి పేర్లను నమోదు చేసుకొనుట, జాబ్ కార్డులు జారీ చేయుట, ఉపాధి కోరే వారిని ప్రోత్సహించుట, పనులను ప్రారంభించుట.

డి) అన్ని రికార్డులు, రిజిస్టర్లు నిర్వహించుట.

ఇ) షెల్ఫ్ ఆఫ్ వర్కులను నిర్వహించుట (ఉపాధి పనులను గుర్తించి ఉంచుకొనుట)

ఎఫ్) పనుల జరిగే స్థలాల వద్ద అన్ని వసతులు కల్పించేలా చూడటం.

జి) అప్పగించిన పనులకు సామాగ్రిని సేకరించుకొనుట (మెటీరియల్)

హెచ్) సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నిర్మహించుట.

ఐ) ఉపాధి కోరిన ప్రతీ కుటుంబానికి కనీసం 100 రోజుల పని దొరికేలా చర్యలు తీసుకొనుట.

జె) హాజరు పట్టీలు నిర్వహించుట, మండల ప్రజా పరిషత్తుకు ఏప్పటికప్పుడు అందచేయుట.

కె) ఫీల్డ్ అసిస్టెంటు, మేట్‌లను గుర్తించుటలో సహకరించుట.

ఎల్) సామాగ్రి కొనుగోలు కొరకు, జిల్లా నీటి యాజమాన్య సంఘం ప్రాజెక్టు డైరెక్టర్/మండల ప్రజాపరిషత్తు ద్వారా నిధులు విడుదలచేస్తుంది.

ఎమ్) ఉపాధి హామీ పథకం అమలులో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌ల సేవలను గ్రామపంచాయితీ తీసుకొనవచ్చును.

### 3. పింఛనులు :-

ఎ) గ్రామసభలలో అర్హత గల ఫించనుదారులను గుర్తించుట.

బి) చనిపోయినవారిని గుర్తించి వారి పేర్లను జాబితాల నుండి తొలగించేందుకు గ్రామసభ సిఫార్సుల కోసం వివరాలు ముందుంచుట.

సి) పింఛను బట్వాడాను గ్రామసభలో సమీక్షించుట.

డి) నూతన పింఛన్ దార్ల జాబితాలను ఎప్పటికప్పుడు తయారుచేసుకోవడం.

ఇ) పింఛను పంపిణీ సంబంధించిన రికార్డులను నిర్వహించుట.

ఎఫ్) గ్రామపంచాయితీ సర్పంచ్/సెక్రటరీల సమక్షములో పింఛనుల పంపిణీ జరుగుతుంది.

జి) స్థానికుల నిర్ణయం ప్రకారం గ్రామపంచాయితీ కార్యదర్శి గ్రామసమైఖ్య సహకారంతో సేవలు.

**(జి.ఓ.ఎం.ఎస్.నెం.571. పి.ఆర్.డి (ఆర్.డి) శాఖ, తేది: 26-12-2007)**

## 4. నీటి సరఫరా, పారిశుద్ధ్యం :-

**1. నీటి సరఫరా వ్యవస్థలను అభివృద్ధిపరచుట (రూ. 132 కోట్లు వార్షిక ప్రణాళిక):-**

ఎ) గ్రామసభ మరియు గ్రామ పంచాయితీల ప్రమేయముతో పథకములు మరియుఅమలు చేసే ప్రదేశాలను గుర్తించడం.

బి) ఒకే గ్రామపంచాయితీ పరిధిలో గల పథకముల నిర్వహణ (వార్షిక కేటాయింపు 63 కోట్లు)

సి) ఓ. హెచ్. ఎస్. ఆర్‌లు శుభ్రపరచుట, నూతులను క్రమంతప్పకుండా క్లోరినేట్ చేయుట.

డి) గ్రామ పంచాయితీ పరిధిలోగల అన్ని గ్రామాల కుటుంబాలకు త్రాగునీటి సరఫరాను సక్రమంగా అందచేయుట.

ఇ) నీటి నాణ్యతను పరిశీలించుట, కాపాడుట.

ఎఫ్) గ్రామంలో మంచినీటి పైపులైను పనుల నిర్వహణ

జి) ఇంటి కనెక్షన్లను ప్రోత్సహించుట.

హెచ్) నీరు మరియు పారిశుద్ధ్య కమిటీలను ఏర్పాటుచేసి యూజర్ చార్జీలు వేసి వసూలు చేయటం.

**2. గ్రామీణ పారిశుద్ధ్యం (రూ. 178 కోట్ల వార్షిక కేటాయింపు) :-**

ఎ) గ్రామ పంచాయితీ నందు సంపూర్ణ పారిశుద్ధ్య ప్రణాళికలు తయారుచేయుట మండల పరిషత్‌కు సమర్పించుట.

బి) సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని అమలుచేయటం.



సి) వీధులను శుభ్రపరచుట, మురుగు కాల్వల శుభ్రత, నిర్మాణాలు చేసట్టడం, వ్యర్థపదార్థాల నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, మురుగునీటి పారుదల, ఇంకుడు గుంటలు, మంచినీటి వనరుల చుట్టు ప్లాట్‌ఫారమ్‌లు నిర్మించుట, డంపింగ్ యార్డులను ఏర్పాటుచేయుట మరియు ఆరోగ్యం, పారిశుద్ధ్యం పై అవగాహన కలుగచేయుట.

**(జి.ఓ.ఎం.ఎస్.నెం.569-పి.ఆర్. అండ్ ఆర్.డి. శాఖ ది.22.12.2007)**

## 2. వ్యవసాయం మరియు సహకార శాఖ

**1. భూసార మరియు నీటి సంరక్షణ - వాటర్ షెడ్ అభివృద్ధి :-**

వాటర్‌షెడ్‌ల ఎంపిక

**2. విపత్తుల నిర్వహణ ప్రకృతి వైపరిత్యాలు :-**

ప్రకృతివిపత్తులు సంభవించినప్పుడు నష్టాలను అంచనా వేయడానికి సర్వే చేయించి నివేదికలు తయారుచేయటం.

**3. ప్రోత్సాహక బహుమతులు :-**

రైతుల జాబితాలను రూపొందించి మండల పరిషత్తులకు పంపుట.

**(జి.ఓ.ఎం.ఎస్.నెం. 1 వ్యవసాయ మరియు సహకార శాఖ తేది:01-01-2008)**

## 3. పశుసంవర్ధక, మత్స్యాభివృద్ధి-మత్స్యకారుల సంక్షేమశాఖ

**1. పశు సంవర్ధక సేవలు :-**

ఎ) గ్రామాలలో పశువైద్యశిబిరాల నిర్వహణలో సహకారం.

బి) వ్యాధులు ప్రబలినపుడు సమాచారమును పశుసంవర్ధక శాఖ వారికి తెలియపరుచుట.

సి) పశు - సంవర్ధక శాఖనందు పనిచేయుచున్న సిబ్బంది పనితీరుని పర్యవేక్షించుట, ఎక్కడైనా సిబ్బంది అవసరమైనచో పారా-వెట్స్‌ని గుర్తించుట.

**2. పశుగ్రాసం అభివృద్ధి : -**

ఎ) పశుగ్రాసం అవసరాలను గుర్తించి మండల పరిషత్తుకు నివేదించుట.

బి) పశుగ్రాసం పండించుటకు లబ్ధిదారులను గుర్తించుట.

సి) లబ్ధిదారులకు, రైతులకు పశుగ్రాస విత్తనాలను పంపిణీచేయుట.

**3. పశుగన భీమా : -**

ఎ) పశువులకు భీమా సౌకర్యం వర్తింపచేయుటకు లబ్ధిదారులను ఎంపిక చేయటం, ప్రీమియం వసూలుకు సహకరించటం.

**4. ప్రకృతి వైపరిత్యాల సమయంలో సహాయ కార్యక్రమాలు : -**

ఎ) ప్రకృతి వైపరిత్యాల సమయంలో పశువులకు ప్రత్యేక సహాయ శిబిరాలు నిర్వహించుట, ఇతర సహాయం కొరకు లబ్ధిదారులను/ రైతులను గుర్తించుట.

**5. భవనాల నిర్మాణము మరియు నిర్వహణ : -**

భవనాల నిర్మాణం కొరకు అనువైన స్థలాల ఎంపిక, భవనాల నిర్మాణపు పనులు/మరమ్మత్తు/నిర్వహణలను పర్యవేక్షించుట.

**6. ప్రభుత్వేతర పశుగణ క్షేత్రాల నియంత్రణ : -**

ప్రభుత్వేతర పశుగణ క్షేత్రాలకు అనుమతులు జారీచేయుట.

**7. కబేళాలు : -**

కబేళాల ఏర్పాటు, మాంస ప్రమాణాలు పరిశీలించుట.

**8. పరపతి సౌకర్యం : -**

పరపతి సౌకర్యం కొరకు లబ్ధిదారుల ఎంపిక.



**9. రైతుల సామంర్థ్యాల పెంపుదల : -**

గ్రామాలలో అవగాహణ శిబిరాల ఏర్పాటుకు వారి అవసరాలు గుర్తింపు.

**(పశు సంవర్ధన, పాడి అభివృద్ధి మరియు మత్స్యశాఖ జి.ఓ.ఎం.ఎస్.నెం. 106 తేదీ: 31-12-2007)**

**10. భూతల మరియు సముద్ర ప్రాంతాలలో మత్స్యాభివృద్ధి : -**

ఎ) చేపల పెంపకమునకు గ్రామ కుంటలను అభివృద్ధి చేయుట.

బి) వివిధ కార్యక్రమాల క్రింద సహాయం కోరకు లబ్ధిదారులను గుర్తించుట.

సి) పడవలు, వలలు మరియు ఇతర సామాగ్రి పంపిణీలో మండల పరిషత్తుకు సహకరించడం.

డి) చేపల కుంటల మరియు చెరువుల అభివృద్ధి.

ఎఫ్) గ్రామపంచాయితీ ఆధీనములోగల చెఱువులు/కుంటలలో చేపల వేట హక్కులకు లీజుకు ఇవ్వటం.

**11. మత్స్యకారుల సంక్షేమ కార్యక్రమాలు : -**

ఎ) ప్రభుత్వం/మండల పరిషత్/జిల్లా పరిషత్ పథకాల అమలుకు గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక.

బి) భీమా పథకములలో చేరే విధంగా మత్స్యకారులను ప్రోత్సహించుట.

సి) అర్హతగల మత్స్యకారులను (పురుషుల మరియు స్త్రీలతో) గుర్తించి స్వయం సహాయక సంఘముల ఏర్పాటు.

**(పశు సంవర్ధన, పాడి అభివృద్ధి మరియు మత్స్యశాఖ జి.ఓ.ఎం.ఎస్.నెం. 105 తేదీ: 31-12-2007)**

# 4. సాంఘిక సంక్షేమ శాఖ

**1. సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో అడ్మిషన్లు : -**

అర్హతగల విద్యార్థుల గుర్తించుట, వారి పేర్లు మండల పరిషత్తుకు సిఫారసు చేయుట.

**2. స్కూల్ యూనిఫారములు ఇతర వస్తువుల పంపిణీ : -**

దుస్తులు ఇతర వస్తువుల పంపిణీని చేపట్టడం, సంబంధిత రికార్డులను నిర్వహించటం.

**3. కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం : -**

కమ్యూనిటీ భవనాల నిర్మాణం కొరకు స్థలం ఎంపిక.

**4. అంబేద్కర్ విగ్రహాల ప్రతిష్ఠ : -**

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠకు స్థలాల ఎంపిక

**5. పౌరహక్కుల రక్షణ మరియు అత్యాచారాల నిరోధక చట్టాల అమలు : -**

ఎ) షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగల వారిపై అత్యాచారాల నివారణకు కరపత్రాలు, పోస్టర్లు మరియు స్లైడ్‌ల ద్వారా చట్టాలపై సాధారణ అవగాహన కలుగచేయుట.

**(జి.ఓ.ఎం.ఎస్.నెం.138 సాంఘిక సంక్షేమ శాఖ ది.24.12.2007)**

# 5. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ

**1. కులాంతర వివాహాలు చేసుకొన్న దంపతులకు ప్రోత్సాహకాలు : -**

కులాంతర వివాహం చేసుకొన్న అర్హతగల దంపతులను గుర్తించుట.

**2. హాస్టల్‌లో విద్యార్థుల ప్రవేశం కొరకు నమోదు : -**

సమీపంలోగల హాస్టల్ నందు ప్రవేశం కొరకు నియమాల ప్రకారం అర్హతగల విద్యార్థుల పేర్లను గ్రామపంచాయితీ సిఫార్సు చేయవచ్చు.



**3. ఆరోగ్యం మరియు పారిశుధ్యం : -**

పారిశుద్ధ్య నిర్వహణ

**(జి.ఓ.ఎం.ఎస్.నెం.35 - వెనుకబడిన తరగతుల సంక్షేమ (బి2) శాఖ తేది.24.12.2007 )**

# 6. ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమ శాఖ

**1. ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం : -**

ఎ) పంచాయితీ రాజ్ సంస్థలు తమ పరిధిలోగల అనుపత్రుల కర్యకలాపాలు సమీక్షించి తగు సూచనలు ఇవ్వవచ్చును.

బి) జాతీయ ఆరోగ్య మిషను మరియు ఇతర కార్యక్రమముల క్రింద వచ్చు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించుట మరియు పర్యవేక్షించుట.

సి) మందుల సరఫరా మరియు ఉపయోగమును సమీక్షించుట.

డి) గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య కార్యకలాపాలను సమీక్షించుట మరియు పర్యవేక్షించుట.

ఇ) అంటువ్యాదులు ప్రభలకుండా తీసుకున్న చర్యలను సమీక్షించి, పర్యవేక్షించుట.

ఎఫ్) వైద్య, ఆరోగ్య సంస్థల నిర్మాణము, నిర్వహణ మరియు పరిసరాల పారిశుధ్యము సమీక్షించి పర్యవేక్షించుట.

జి) జిల్లా పరిషత్, మండల పరిషత్ మరియు గ్రామ పంచాయితీలు తమతమ పరిధిలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రముల కార్యకలాపములు తమ స్వంతముగా భావించవలయును.

హెచ్) పంచాయితీరాజ్ సంస్థలు రక్షిత త్రాగునీరు, ఆరోగ్యం మరియు పారిశుధ్యము మొదలగు కార్యకలాపముల యాజమాన్యం స్వీకరించవలెను.

**(జి.ఓ.ఎం.ఎస్.నెం.324 - ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ తేది.24.12.2007 )**

# 7. పాఠశాల విద్యా శాఖ

## 1. పాఠశాల విద్య : -

ఎ) ప్రతీ గ్రామ పంచాయితీ నందు గ్రామ సర్పంచ్ అధ్యక్షునిగా విద్యకు సంబంధించిన ఉపకమిటీ ఏర్పాటు చేయాలి.

బి) గ్రామ పంచాయితీ పరిధిలో గల అన్ని పాఠశాలల పనితీరును ఉపకమిటీకి పర్యవేక్షించే అధికారం ఉంటుంది.

సి) పాఠశాల ఉపాధ్యాయులు విద్యా ఉపకమిటీతో సమావేశం నిర్వహించి పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హజరు, డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలు, పాఠశాల నిర్వహణ అవసరాలు గుర్తించి గ్రామ పంచాయితీనుంచి కోరవలసిన సహకారం గురించి చర్చించవలెను.

ఉపాధ్యాయుల హజరు తనిఖీ, పాఠశాల సక్రమనిర్వహణ, మద్యాహ్న భోజన పథకం అమలు, తనిఖీచేసే అధికారం గ్రామ పంచాయితీకి ఉంటుంది.

పాఠశాల అభివృద్ధికి సంబంధించి నిర్వహణ సామాగ్రి, నూతన నిర్మాణాల నాణ్యత ప్రమాణాలను ఉపకమిటి తనిఖీ చేసి లోపాలను ఉన్నత అధికారులకు తెలియజేసే అధికారం ఉంటుంది.

ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివే విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ గ్రామ పంచాయితీ సహకారంతో విద్యా ఉపకమిటిలు చేపట్టాలి.

**(జి.ఓ.ఎం.ఎస్.నెం.2 - పాఠశాల విద్యా శాఖ తేది.3.1.2008 )**

# ఇతర ప్రచురణలు .......

1. గిరి'జన' జీవన సంఘర్షణ
2. ఆదివాసుల అరణ్యరోదన
3. మడ అడవుల ప్రాముఖ్యత - పరిరక్షణలో మన బాధ్యత
4. ఆదివాసీ ప్రాంతాల్లో ఉమ్మడి అటవీ యాజమాన్యం - పరిశీలన
5. సంక్షిప్త న్యాయదర్శిని
6. మన చట్టాలు తెలుసుకుందాం
7. పంచాయితీరాజ్ చట్ట సవరణ - వివరణ
8. ఏవి మానవహక్కులు
9. ఏజెన్సీ ప్రాంత చట్టాలు - న్యాయ విద్య
10. అభివృద్ధిలో ఆదివాసులు
11. ఆదివాసీ ప్రాంత ఉద్యమాల నేపథ్యం
12. Land Rights of Adivasis in Andhra Pradesh
13. జాతీయ గిరిజన విధాన ముసాయిదా 2006
14. Land Mark Judgments on Land Transfer Regulations 1 of 70.
15. ఆదివాసీల అటవీ హక్కుల గుర్తింపు చట్టం - 2006
16. ఏజెన్సీ ప్రాంతాలలో అమలుకాని గ్రామ పంచాయితీ పాలన
17. గ్రామ పంచాయితీ అధికారాలు -బాధ్యతలు, పంచాయితీ సెక్రటరీ విధులు
18. హెచ్.ఐ.వి. / ఎయిడ్స్ - మావన హక్కులు
19. ఏజెన్సీ ప్రాంత వనరుల పరాయీకరణ - ఆదివాసీల నిరాశ్రయత
20. పోల'వరం' కాదు ఆదివాసీలకు శాపం
21. Gram Panchayats- Case Law Digest
22. మహిళల హక్కులు
23. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంత పంచాయితీ రాజ్ (పెసా) చట్ట నియమములు 2011